# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 16 సంచిక:153 | విజయవాడ, 26-02-2026, గురువారం | పేజీలు: 8 | వెల: 1.00


## దోస్తుపల్లి శివారులో పులి చనిపోయిందా.? చంపేశారా.?

జుక్కల్ :జుక్కల్ మండలంలోని దోస్తుపల్లి గ్రామంలో పులి చనిపోయినట్టు మంగళవారం గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిని చంపేశారా చనిపోయిందా అనే విషయంలో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## పెట్టుబడులకు అత్యంత సురక్షితమైనది.. భారత్: సీఎం చంద్రబాబు


దావోస్: : ప్రస్తుతం భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా వేగంగా రూపాంతరం చెందుతోందని ఏపీ నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే భారత్ ఇప్పుడు పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన గమ్యస్థానమని పేర్కొన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఇండియా లాంజ్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. నేషన్ ఫస్ట్ అనే స్ఫూర్తి చాటేలా టీమ్ ఇండియాగా అంతా కలిసి పనిచేద్దామని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులకు పిలుపునిచ్చారు.

బలమైన నాయకత్వం..

ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు భారత్ వైపు మాత్రమే చూస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. మన దేశానికి బలమైన నాయకత్వం ఉందని... మన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పామని తెలిపారు. పటిష్టమైన వ్యవస్థల రూపకల్పన కూడా జరుగుతోందని వివరించారు. దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా భారత్‌కే ప్రాతినిధ్యం వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాలుగా పోటీపడినా.. దేశంగా ఒక్కటిగానే ఉన్నామని, పరస్పరం సహకరించుకుంటున్నామని వెల్లడించారు. సంపద ఒక్కటే కాదని.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్..

ఏపీలో ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం



చేశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నుంచి ప్రపంచం ఎలా ముందుకు వెళ్తోందో నేర్చుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రస్తుతం అంతా గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉందని వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా 2047 నాటికి అగ్రస్థానానికి చేరుతుందని సీఎం పేర్కొన్నారు.




## యూఏఈ ఆర్థిక మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ

దావోస్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు.. యూఏఈ ఆర్థిక మంత్రి అల్ మార్రీతో భేటీ అయ్యారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు, ఏపీ-యూఏఈ మధ్య ఆర్థిక భాగస్వామ్య బలోపేతంపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్‌లో యూఏఈతో కలిసి పనిచేసేందుకు అంగీకారం కుదిరింది. యూఏఈకి చెందిన 40 సంస్థలు ఏపీలో ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామని అల్ మార్రీ పేర్కొన్నారు. ఆహార భద్రత, లాజిస్టిక్స్, పోర్ట్ ఆధారిత పరిశ్రమల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చ జరిగింది. పునరుత్పాదక శక్తి, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ఇరువురు చర్చించారు.

## కల్తీ మద్యం కేసులో జోగి సోదరులకు బెయిల్..

విజయవాడ, ఏపీ కల్తీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాముకు విజయవాడ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు



చేసింది. 6వ ఏఓఈఅ కోర్టు భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో వీరిద్దరికి బెయిల్ మంజూరు చేసింది.

కేసు వివరాలిలా..

జోగి రమేశ్, జోగి రాము.. భవానీపురంలో నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసులో ఏ18గా జోగి రమేశ్, ఏ19గా జోగి రాము పేర్లు ఉన్నాయి. అయితే.. ములకల చెరువు కేసులో ఇంకా జోగి రమేశ్‌కు బెయిల్ రాలేదు. దీంతో జైల్లోనే జోగి సోదరులు ఇంకా జైల్లోనే ఉండనున్నారు.

ఆస్పత్రిలో చికిత్స..


అంతకుముందు.. జోగి రమేశ్‌ను విజయవాడ జిల్లా జైలు నుంచి చెయ్యి నొప్పి కారణంగా ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను తిరిగి విజయవాడ జైలుకు తరలించారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి జోగి రమేశ్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో జోగి సోదరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. ప్రాథమిక విచారణలో భాగంగా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు జోగి సోదరులను విచారించారు. ఈ విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విచారణ ఆధారంగా పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు.

## వివేకా హత్య కేసు.. తదుపరి దర్యాప్తు అవసరముందా? లేదా?: సీబీఐని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



దిల్లీ: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు అవసరముందా?లేదా?అని సీబీఐని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దర్యాప్తు అవసరముంటే ఎవరెవరిని విచారించాలో స్పష్టం చేయాలని ఆదేశించింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏయే అంశాలపై తదుపరి విచారణ అవసరమో స్పష్టంగా చెప్పాలని.. ఎవరిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని అనుకుంటున్నారో చెబితే దాన్ని పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను వచ్చేనెల 5కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## ఆంధ్రప్రదేశ్‌లో 10వ తరగతి పరీక్షల తుది షెడ్యూల్ విడుదల




ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరగనున్నాయి.

: ఆంధ్రప్రదేశ్‌లో 10వ తరగతి పరీక్షల తుది షెడ్యూల్ విడుదల అయింది. గతంలో ఇచ్చిన టెంటేటివ్ షెడ్యూల్‌నే ఫైనల్ షెడ్యూల్‌గా ఖరారు చేస్తూ పరీక్షా విభాగం నేడు పాఠశాలలకు సమాచారం ఇచ్చింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రకటన విడుదల చేశారు.

పదవతరగతి పరీక్షల షెడ్యూల్ ఇలా..

మార్చి 16వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్.

మార్చి 18వ తేదీన సెకండ్ లాంగ్వేజ్.

మార్చి 20వ తేదీన ఇంగ్లీషు.

మార్చి 23వ గణితం.


మార్చి 25వ తేదీన ఫిజికల్ సైన్స్.

మార్చి 28వ తేదీన బయోలాజికల్ సైన్స్.

మార్చి 31వ తేదీన సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహిస్తారు.

## గత ప్రభుత్వ రీసర్వే అంతా తప్పుల తడకలే: మంత్రి అనగాని

అమరావతి: కూటమి ప్రభుత్వ హయంలో పూర్తి కచ్చితత్వంతో రీసర్వే 2.0 చేపడుతున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇప్పటికే మూడు దశల్లో 2,097 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందని.. నాలుగో దశలో 1,613 గ్రామాల్లో కొనసాగుతున్నట్లు వెల్లడించారు. రైతుల సంపూర్ణ భాగస్వామ్యంతో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే కాలాన్ని 90 రోజుల నుంచి 143 రోజులకు పెంచామని చెప్పారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే అంతా తప్పుల తడకలే అని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి గత ప్రభుత్వ రీసర్వేపై 7.5 లక్షల ఫిర్యాదులు అందాయని తెలిపారు. గత ప్రభుత్వం పాస్ పుస్తకాలపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌లో రియల్ టైమ్ డేటా కనపడడం లేదని విమర్శించారు.




కూటమి ప్రభుత్వ క్యూఆర్ కోడ్‌లో రియల్ టైమ్ డేటాతో పాటు నావిగేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## పోలవరం ప్రాజెక్ట్ లో రెండోరోజు కొనసాగుతున్న విదేశీ నిపుణుల బృందం పర్యటన

పోలవరం, : పోలవరం ప్రాజెక్ట్ లో విదేశీ నిపుణుల బృందం రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. విదేశీ నిపుణులు సీన్ హించిబెర్గర్ , డేవిడ్ బి పాల్ , జియాన్ ఫ్రాంకో డి సీకోలతో పాటు కేంద్ర జల వనరుల శాఖలోని వివిధ విభాగాల సీనియర్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. రెండో రోజు మధ్యాహ్నం వీరు మెయిన్ డాం గ్యాప్ 2 ఇసుక రీచ్, మెటీరియల్ లభ్యత మొదలైన వాటిని పరిశీలిస్తారు .అంతకు ముందు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులతో సమావేశమై తొలి రోజు ఫీల్డ్ లో తమ దృష్టికి వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వర రావు, ఈ ఎన్ సి కె నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్ట్ ఎస్ ఈ ఆర్ రామచంద్ర రావు, ఎం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ ఏ గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి తదితరులు అంతర్జాతీయ నిపుణుల బృందంతో పాటు కేంద్ర జలవనరుల శాఖ అధికారులకు వివరాలు అందించారు. వారి వివరాలతో పాటు తాము ఫీల్డ్ లో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించుకొని సందేహాలు తీర్చుకున్నారు. ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి , మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సిఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా , రవి అగర్వాల్ , సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వి ఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, ఎన్ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని ఉన్నారు.

# సంపాదకీయం

## వ్యూహాత్మక చెలిమికి కొత్త చివుళ్లు

దేశాధినేతలు ఎవరైనా సరే, సాధారణంగా విదేశాలకు సావధానంగా వెళ్తారు. అక్కడ ఒకటి రెండు రోజులు ఉండి ద్వైపాక్షిక అంశాలపై తీరిగ్గా చర్చలు సాగిస్తారు. అత్యవసర వేళల్లోనో లేదా ఆతిథ్య దేశంతో తమ సంబంధాల లోతును లోకానికి వెల్లడించాలనుకున్నప్పుడో మాత్రమే సుడిగాలి పర్యటనలు జరుపుతారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ ఆ విధంగానే మొన్న సోమవారం స్వల్పకాలిక పర్యటనకు భారత్‌కు విచ్చేశారు. ప్రధాని మోదీ విమానాశ్రయం దగ్గరికి వెళ్లి ఆయనను స్వాగతించారు. ఇప్పటికే భిన్నరంగాల్లో పెనవేసుకున్న బాంధవ్యాన్ని వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యంగా విస్తరించాలని ఇరువురు నేతలు నిశ్చయించారు. ఈ విశేష పరిణామాలన్నీ ప్రపంచానికి ఓ స్పష్టమైన సందేశాన్ని అందించాయి. అనిశ్చిత అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలు విసురుతున్న సవాళ్లను సమష్టిగా ఎదుర్కొంటూ, ఉమ్మడి ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అనువైన అద్భుత సాధనంగా ఇండియా, యూఏఈ మిత్రత్వం పటిష్ఠమవుతున్న క్రమాన్ని అవి కళ్లకుకట్టాయి!

భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య 1972లోనే దౌత్య సంబంధాలు మొగ్గతొడిగినప్పటికీ గడచిన దశాబ్దంలోనే అవి సరికొత్త ఎత్తులకు చేరాయి. 34 ఏళ్ల విరామానంతరం యూఏఈలో పర్యటించిన భారత ప్రధానిగా 2015లో రికార్డు సృష్టించిన నరేంద్ర మోదీ– ఆపై ఎనిమిదేళ్లలో అయిదు సార్లు ఆ దేశాన్ని సందర్శించి స్నేహబంధాన్ని బలోపేతం చేశారు. ముఖ్యంగా 2022లో సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం ముడిపడిన తరవాత ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా వృద్ధిబాట పట్టింది. 2019–20లో 5900 కోట్ల డాలర్లుగా ఉన్న దాని విలువ 2024–25లో 10వేల కోట్ల డాలర్లకు పైబడింది. రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని వచ్చే ఆరేళ్లలో రెట్టింపు స్థాయికి తీసుకెళ్లాలని మోదీ, మహ్మద్ బిన్ జాయేద్ తాజాగా నిశ్చయించడం హర్షణీయం. ఇరుదేశాల్లోని ఎంఎస్‌ఎంఈలను పరస్పరం అనుసంధానించడం ద్వారా ఆ లక్ష్యాన్ని సాధించబూనడం స్థానికంగా ఉపాధి అవకాశాల పెంపునకు ఊతమిస్తుంది. 2028 మొదలు ఆపై పదేళ్లలో ఏడాదికి అయిదు లక్షల టన్నుల చొప్పున ద్రవీకృత సహజవాయువు సరఫరాకు యూఏఈతో కుదిరిన ఒప్పందం భారత ఇంధన భద్రతకు భరోసానిస్తుంది. కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడంలో ముందున్న యూఏఈ– ఏఐ ఇండియా మిషన్‌లో భాగంగా సూపర్‌కంప్యూటింగ్ క్లస్టర్ ఏర్పాటుకు సహకరించనుండటం మరో సానుకూలాంశం. మన దేశంలో ఏఐ పరిశోధనలు, అప్లికేషన్ల అభివృద్ధి, వాటిని వాణిజ్యపరంగా ఉపయోగించుకోవడానికి అది అక్కరకొస్తుంది!

ఇజ్రాయెల్–హమాస్ పోరు, ఇరాన్–అమెరికాల నడుమ ఉద్రిక్తతలు, యెమెన్‌లో సంక్షోభ పరిస్థితులతో పశ్చిమాసియా ఇప్పుడు రగులుతున్న అగ్నిగుండంలా ఉంది. యెమెన్ అంతర్యుద్ధ నేపథ్యంలో సౌదీ అరేబియాకూ తమకూ దూరం పెరుగుతుండటం, పాకిస్థాన్‌తో సౌదీ ఇటీవల 'నాటో తరహా' రక్షణ ఒప్పందం కుదుర్చుకోవడం, వాటికి తుర్కియే తోడవుతుండటంతో తమ భద్రత, ఆర్థిక స్థిరత్వాలకు భరోసానిచ్చే శక్తిమంతమైన, విశ్వసనీయమైన నేస్తంగా ఇండియాను యూఏఈ భావిస్తోంది. అరబ్ దేశాల్లో పాకిస్థాన్ ప్రాబల్యాన్ని తగ్గించడంతో పాటు పశ్చిమాసియాలో పరపతి విస్తరణకు, 'ఐమెక్' ఆర్థిక నడవా వంటి వాటి సాకారానికి యూఏఈతో దోస్తీ దోహదపడుతుందని భారత్ తలపోస్తోంది. గడచిన పాతికేళ్లలో 2200 కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టడం ద్వారా భారత ప్రగతియాత్రలో యూఏఈ భాగస్వామి అయితే– 43 లక్షల మంది ప్రవాస భారతీయుల వృత్తినైపుణ్యాలు ఆ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఆర్థిక, సాంస్కృతిక, రక్షణ సంబంధాల పునాదులపై పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా ద్వైపాక్షిక బంధం కొత్త చివుళ్లు తొడుక్కునే కొద్దీ అది ఇంకా ఉభయతారకమవుతుంది!

# బీఆర్‌ఎస్‌కు వలసల బెడద

కరీంనగర్): తెలంగాణ ఉద్యమకాలంలో, రాషా?ట్రన్ని సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత దశాబ్దంపాటు జిల్లా బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా నిలిచింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషనలో మేయర్ పీఠాన్ని అధిష్ఠించిన ఆ పార్టీ ప్రస్తుత కార్పొరేషన ఎన్నికల సమయంలో గుండె చెదురుతున్న వాతావరణం కనిపిస్తున్నది. గత ఎన్నికల్లో ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేని కాంగ్రెస్ ఈసారి అధికారపార్టీగా గెలుపుకలలు కంటోంది. కార్పొరేషనపై కాషాయ జెండాను రెపరెపలాడించడం ఖాయమని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. గతంలో అధికారపీఠాన్ని అలంకరించిన బీఆర్‌ఎస్ నుంచి రోజుకొకరుగా మాజీ కార్పొరేటర్లు పార్టీని వీడుతున్నారు.




అసెంబ్లీ ఎన్నికల తర్వాత లెక్కలు తారుమారు

కరీంనగర్ కార్పొరేషన జిల్లా రాజకీయాలకు ఆయువు పట్టులాంటిది. కార్పొరేషనతోపాటు కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాలు కలిస్తే కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం. కరీంనగర్ కార్పొరేషనను దక్కించుకున్న వారికే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అనుకూల ఫలితాలు వస్తాయని అన్ని పార్టీలు విశ్వసిస్తాయి. అసెంబ్లీ నియోజకవర్గంలోని మూడు వంతుల ఓట్లు ఈ కార్పొరేషన పరిధిలోనే ఉండడంతో అన్ని రాజకీయ పక్షాలు ఇక్కడ విజయం సాధించడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయి. ఇప్పుడు కూడా అన్ని పార్టీలు అదే ఆలోచనతో కార్పొరేషన ఎన్నికలపై దృష్టి సారిస్తున్నాయి. కరీంనగర్ కార్పొరేషన పరిధిలో గత ఎన్నికల సమయంలో 60 డివిజన్లు ఉండగా వాటిలో 33 స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్‌ఎస్ స్పష్టమైన ఆధిక్యతతో మేయర్ పదవిని చేపట్టింది. బీఆర్‌ఎస్‌కు చెందిన వై సునీల్‌రావు మేయర్‌గా అదే పార్టీకి చెందిన చల్ల స్వరూపరాణి డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో 13 స్థానాలను బీజేపీ, ఆరు స్థానాలను ఎంఐఎం, ఎనిమిది స్థానాలను ఇండిపెండెంట్లు దక్కించుకున్నారు. ఒక ఇండిపెండెంట్ ఎన్నికల తర్వాత ఎంఐఎంలో చేరగా, ఏడుగురు ఇండిపెండెంట్లు ఆనాటి అధికార పార్టీ అయిన బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీలో గెలిచిన ఒక కార్పొరేటర్ ఎన్నికల తర్వాత కొంత కాలానికి బీఆర్‌ఎస్‌లో చేరారు. అయిదేళ్ళపాటు ఈ పాలకవర్గం కొనసాగగా కార్పొరేషన రాజకీయాల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఇండిపెండెంట్లు, బీజేపీ సభ్యుడి చేరికతో 41 స్థానాలకు చేరుకున్న బీఆర్‌ఎస్ నుంచి తొమ్మిది మంది కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పాలకవర్గం గడువు ముగిసేనాటికి ఒక్కస్థానం కూడా లేని కాంగ్రెస్ తొమ్మిది మంది కార్పొరేటర్ల బలాన్ని పొందింది. బీఆర్‌ఎస్ బలం 32కు పడిపోయింది. బీజేపీ 12, ఎంఐఎం ఏడుగురు కార్పొరేటర్లతో ఉంది.

ఇతర పార్టీల్లోకి వరుస కడుతున్న నాయకులు

ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారపార్టీగా మారడంతో ఆ పార్టీకి మద్దతు పెరుగుతూ వస్తున్నది. కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన బండిసంజయ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వంలో హోంశాఖ సహాయమంత్రి పదవి చేపట్టడంతో జిల్లా రాజకీయాల్లో ఆయన పాత్ర కీలకంగా మారింది. బీజేపీకి పట్టణ ప్రాంతంలో ఆదరణ పెరగడం, దానికి కేంద్రమంత్రిగా బండి సంజయ్ ప్రభావం తోడవడంతో పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఆ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారు. బీజేపీకి ప్రజల్లో ఆదరణ ఉన్నా కొన్ని డివిజన్లలో ప్రజల్లో పరిచయం, పలుకుబడి ఉన్న నేతలు లేరు. ఆ లోటును భర్తీ చేస్తూ బీజేపీ అభ్యర్థులుగా బరిలో నిలిచి కార్పొరేటర్లుగా విజయం సాధించాలని పలువురు మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు ఆలోచిస్తున్నారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్‌గా ఉన్న బండారి వేణు రెండు రోజుల క్రితం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా మాజీ కార్పొరేటర్లు గూడూరి మురళి, పెద్దపల్లి రవీందర్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. మేయర్‌గా పనిచేసిన సునీల్‌రావు తన పదవీకాలం ముగియగానే మాజీ కార్పొరేటర్లు శ్రీదేవి చంద్రమౌళి, లెక్కల స్వప్నవేణుతో కలిసి బీజేపీలో చేరారు. మరికొంత మంది తాజా మాజీ కార్పొరేటర్లు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైపు చూస్తున్నారని, వారంతా ఆయా పార్టీల నేతలతో మంతనాలు జరుపుతూ ఒకటిరెండు రోజుల్లో ఆయా పార్టీలో చేరే అవకాశాలున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

పట్టు నిలుపుకుంటారా..

జిల్లాలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న కరీంనగర్ కార్పొరేషనతోపాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో చొప్పదండి మినహా మిగతా మూడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో ఉన్నాయి. కీలకమైన కరీంనగర్ కార్పొరేషనలో గెలుపు గుర్రాలను ఎంపిక చేసి గెలిపించే బాధ్యత మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై ఉంది. హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలను గెలిపించుకునే బాధ్యత బీఆర్‌ఎస్ అక్కడి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఉంచింది. ఈ మూడు కూడా గతంలో బీఆర్‌ఎస్ పాలకవర్గాల పాలనలోనే ఉన్నాయి. ఇప్పుడు వాటిని దక్కించుకోవడం ఆ పార్టీకి సవాల్‌గా మారింది.

# అభివృద్ధి పనులపై నజర్

జగిత్యాల, జనవరి 21: పంచాయతీ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన కాంగ్రెస్ పార్టీ మున్సిపాల్ ఎన్నికల్లో సైతం విజయం సాధించేందుకు సమాయత్తం అవుతోంది. వచ్చే వారం రోజుల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, సంక్షేమ కార్యక్రమాలు చేసే పనుల్లో అధికార పార్టీ నేతలు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఇతర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ధర్మపురి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

జగిత్యాలలో మంత్రి అడ్లూరి చేతుల మీదుగా..

జగిత్యాల మున్సిపల్‌లో రెండు, మూడు రోజులుగా పలు అభివృద్ధి పనుల వేగాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు పెంచుతున్నారు. ఇప్పటికే పలు పర్యాయాలు మంత్రి అడ్లూరి జగిత్యాలలో పర్యటించారు. తాజాగా జిల్లా కేంద్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించి రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపనలు నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రూ.235 కోట్ల నిధులతో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా 450 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి భూమి పూజ, రూ.23.5 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించారు. రూ.3 కోట్లతో సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ప్రారంభం, రూ.1.50 కోట్ల నిధులతో టీఆర్ నగర్ ప్రభుత్వ వయో వృద్ధుల సదనం ప్రారంభం తదర అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన

ధర్మపురి మున్సిపాలిటీలో బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిర్ణయించారు. రూ.200 కోట్లతో యంగ్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం, రూ.17 కోట్ల నిధులతో సివరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. టీఎఫ్ఐడీ నిధులు రూ.15 కోట్లతో మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులు, రూ.4 కోట్లతో విద్యుత్ స్తంభాలు, కొత్త లైన్ల ఏర్పాటు, రూ.2 కోట్ల నిధులతో పలు కుల సంఘాల భవనాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు నిర్వహించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేస్తున్నారు.

2,094 సంఘాలకు వడ్డీ లేని రుణాలు

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను తాజాగా ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో గల 2,094 మహిళా సంఘాలకు రూ.6,80,57,296 వడ్డీ లేని రుణాలు మంజూరు అయ్యాయి. వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలోని డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలకు చెందిన రుణాల వడ్డీ, 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెందిన రుణాల వడ్డీ ప్రభుత్వం విడుదల చేసింది. రెండు రోజుల క్రితం జగిత్యాలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్ తదితరుల చేతుల మీదుగా మహిళలకు అందించారు.

ఐదు మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాల కింద ఇటీవల ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. నగర అభివృద్ధి కింద రాయికల్ మున్సిపల్‌కు రూ.15 కోట్లు, ధర్మపురి మున్సిపల్‌కు రూ.15 కోట్లు, యూఐడీఎఫ్ కింద మెట్‌పల్లి మున్సిపల్‌కు రూ.18.07 కోట్లు, కోరుట్ల మున్సిపల్‌కు రూ.18.07 కోట్లు, జగిత్యాల మున్సిపల్‌కు రూ. 62.05 కోట్లు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ కూయకముందే పనులు ప్రారంభించడానికి సమాయత్తం అవుతున్నారు.

మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో యువతీ యువకులను ఆకట్టుకునేలా ఇటీవల మెట్‌పల్లి మున్సిపల్ మెగా జాబ్ మేళాను నిర్వహించారు. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ధర్మపురి దేవస్థాన అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు తదితరులు జాబ్‌మేళాను నిర్వహించారు.

# గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

చందుర్తి, జనవరి 21: గ్రామీణ ప్రాంతా ల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభు త్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నా రు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొబైల్ ఎక్స్‌రేను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్‌లో భాగం 24 లక్షలతో మొబైల్ ఎక్స్‌రేను అందుబాటులోకి తెచ్చామన్నా రు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఈ పరికరం ఉపయోగ పడుతుందన్నారు. జిల్లా పరిధిలోని గుర్తింపు పొందిన టీబీ రోగులకు మొబైల్ ఎక్స్‌రేల ద్వారా ఆయాప్రాంతాల్లో వైద్యం అందించేందుకు వారి ఇంటికి వెళ్లి వారికి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. గ్రామాల్లోకి వెళ్లి టీబీ రోగులను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. నూత న టెక్నాలజీ ద్వారా వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అంది స్తుందని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆధ్వర్యంలో పేదలకు వైద్య సేవ లందిస్తున్నట్లు తెలిపారు. వేములవాడలోని వంద పడకల ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిమ్స్‌ను ఆధునీకరిస్తు న్నామని, నయా ఉస్మానియా ఆసుపత్రి అభివృద్ధి చేస్తున్న ట్లు తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వ ఆసుపత్రులలను సద్వి నియోగం చేసుకోవాలన్నారు.

# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి

సిరిసిల్ల, జనవరి 21: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ మహేష్ బీ గీతే పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కా ర్యాలయంలో నేర సమీక్ష నిర్వ హించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల విచారణలో జాప్యం జరిగి తే సహించేదిలేదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బా ధితులకు న్యాయం చేకూరేలా బాధ్యతాయుతం గా వ్యవహరించాలన్నారు. ప్రాసిక్యూషన్‌లో భా గంగా కోర్టు వారు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై, తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా జరి గేలా అధికారులు అందరూ బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమ లు చేస్తూ పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగిం చుకునేలా భద్రతాపరమైన అన్ని చర్యలు చేప ట్టాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఉక్కుపాదం మోపాలని, ప్రతిరోజు రౌడి, హిస్టరీ షీటర్స్‌ను తనిఖీ చేస్తూ వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముం దస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం, అక్రమ ఇసుక రవాణా లాంటి అసాం ఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యే క నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంకెన్‌డ్రైవ్, బహి రంగ ప్రదేశాల్లో మద్యపాన సేవనంపై కఠినం గా వ్యవహరించాలని, పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతిరోజు వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, నో హెల్మెట్ నో పెట్రోల్ పై వాహనదారులకు అవగాహన కల్పించాల న్నారు. ఈసమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి ఐపీఎస్.అదనపు ఎస్పీ చంద్ర య్య, డిఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కృష్ణ, మొ గిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వేంకటేశ్వర్లు, శ్రీని వాస్, నాగేశ్వరరావు, రవి, మధుకర్, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్ఐలు ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇటు సంతోషం.. అటు నిరీక్షణ..

, సిరిసిల్ల) సన్న రకం వరి సాగు వైపు రైతులను మళ్లించడానికి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రూ.500బోనస్ సంతోషాన్ని కలిగిస్తున్నది. అయితే పాత బకాయిల కోసం నిరీక్షణ నిరాశపరుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు పూర్తి చేశారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించినట్లుగానే క్వింటాలుకు రూ 500 బోనస్ చెల్లిస్తూ వస్తున్నారు. గత యాసంగి సీజన్లో



విక్రయించిన సన్న రకం ధాన్యం బోనస్ కోసం రైతులు దాదాపు తొమ్మిది నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సన్న రకం పాత బకాయిలను చెల్లిస్తామని ప్రకటించడం కొత్త రైతులకు ఉరట ఇచ్చినా, చెల్లింపులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితుల్లోనే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముగిసిన వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లలో 49068 మంది రైతుల నుంచి రూ.645.61 కోట్ల విలువైన 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం 2.57 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా సన్న రకం ధాన్యం 13106 మెట్రిక్ లో ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్న రకం ధాన్యం బోనస్ రూ 6.60 కోట్లు కాగా, ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ 5.35 కోట్లు జమ చేశారు. బోనస్ రూ 1.26 కోట్లు బకాయిగా ఉంది. వీటిని కూడా త్వరలోనే జమవుతాయని చెబుతున్నారు. యాసంగి ధాన్యం బోనస్ కోసం రైతులు ఎదురు చూడక తప్పడం లేదు.

జిల్లాలో సన్న రకం ధాన్యం బోనస్ రూ 4.38 కోట్లు పెండింగ్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజన్లో 244 కొనుగోలు కేంద్రాల ద్వారా 44767 మంది రైతుల నుంచి రూ 624.89 కోట్లు విలువైన 2.69 లక్షల మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 2.60 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం 8786 మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్నరకం దాన్యంలో ఐకేపీ ద్వారా 7291 మెట్రిక్ టన్నులు, సింగిల్ విండోల ద్వారా 1388 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 105 మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 1255 మంది రైతులు సన్నరకం బోనస్‌కు అర్హులుగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బోనస్ బకాయిలు రూ 4.38 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో సన్నరకం సాగుపై రైతులు మొదట్లో ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఉపయోగపడుతుందని ఆసక్తి చూపిన బోనస్ డబ్బులు రాకపోవడంతో వానకాలం సీజన్లో సన్న రకాల సాగు తగ్గించారు. గత ఏడాది వానకాలం సీజన్‌లో జిల్లాలో 13 వేల ఎకరాల్లో సన్న రకాల సాగు చేశారు. రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500బోనస్ జమ చేయడంతో యాసంగి సీజన్‌లో సన్నల సాగును పెంచుకుంటూ 17 వేల ఎకరాలు సాగు చేశారు. ఆరు నెలలుగా బోనస్ రాకపోవడంతో జిల్లాలో వానాకాలం సీజన్‌లో 1.84 లక్షల ఎకరాలు వరి సాగు చేసిన సన్నరకం సాగు 9478 ఎకరాలకు పరిమితం అయ్యారు.

జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం దిగుబడి అంచనా 4.54 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. 49068 మంది రైతుల నుంచి 270472 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలోని 260 గ్రామపంచాయతీలు ఉండగా 239 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోల్లు పూర్తి చేశారు. ఐకెపీ 159 కేంద్రాల ద్వారా 160745 మెట్రిక్ టన్నులు, 72 సింగిల్ విండోల ద్వారా 100881 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ఒక కేంద్రం ద్వారా 2929 మెట్రిక్ టన్నులు, ఏడు మెప్మా కేంద్రాల ద్వారా 5916 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఏలాంటి ఇబ్బందులకు గురి కాకుండానే కొనుగోళ్లు పూర్తి చేశారు. పౌరసరఫరాల శాఖ 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా వేయగా లక్ష్యం మేరకు 270472 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళు చేసింది.

జిల్లాలో 49068 మంది రైతుల నుంచి 270472 మెట్రిక్ టన్నుల ధాన్యం పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసింది. వంద శాతం రూ 645.61 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఐకేపీ ద్వారా రూ 383.78 కోట్లు, సింగిల్ విండోల ద్వారా రూ 240.70 కోట్లు, డీసీఎంఎస్ ద్వారా రూ.7 కోట్లు, మెప్మా ద్వారా 14.14 కోట్ల చెల్లించారు.

## పారదర్శకంగా ఎన్నికల బాధ్యతలు..

సిరిసిల్ల, జనవరి 21 మున్సిపల్ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్టాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు



ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన హ్యాండ్ బుక్‌ను చదవాలన్నారు. సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏలాంటి సందేహాలు ఉ న్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే మున్సిపల్ కార్యాలయాన్ని ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఎస్ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో విధులు నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. శిక్షణ తరగతుల్లో సీపీవో శ్రీనివాసచారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, మాస్టర్ ట్రెయినర్లు తది తరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజాబాట

ముత్తారం, జనవరి 21: క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే విద్యుత్ శాఖ ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిజిఎన్‌పిడిసి ఎల్ ఏఈ రాజేందర్ తెలిపారు. అడవీ శ్రీరాంపూర్‌లో ప్రజాబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల నుంచి విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. పాత స్తంభాలు తొలగించి కొత్తవి బిగిస్తామని, లూస్ లైన్లను సరి చేస్తామని చెప్పారు. సర్పంచ్ అన్నపూర్ణ ఉపేందర్, ఉప సర్పంచ్ హరిత తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీ, ఎఎంసి వైస్ చైర్మన్ రాజయ్య,



మైనారిటీ మండల అధ్యక్షులు వాజీద్ పాషా, కార్యదర్శి మల్లీశ్వరీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎలిగేడు, గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ప్రజాబాట కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంపత్ రెడ్డి తెలిపారు. రాములపల్లిలో ప్రజాబాట కార్యక్రమాన్ని చేపట్టి, ప్రజలు, రైతుల నుంచి సమస్యలపై చర్చించారు. విద్యుత్ సంస్థ అందుబాటులోకి తె చ్చిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సిద్ది తిరుపతి, ఉపసర్పంచ్ తీట్ల విద్యాలత విజయ్, సబ్ ఇంజనీర్ రాజమల్లయ్య, ఎల్ఐ సూర్యనారాయణ, ఎల్ఎం భాస్కర్, ఏఎల్ఎం లక్ష్మణ్, జీపీ కార్యదర్శి హరిబాబు, పాల్గొన్నారు.

గుండారంలో సర్పంచ్ జంగిలి పోచాలు అధ్యక్షతన ఏడీఈ వెంకట్ ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కా రానికి చర్యలు చేపట్టారు. అలాగే 1912 టోల్‌ఫ్రీ నెం బర్‌ను సద్వినియోగం చేసుకుని నేరుగా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఉ పసర్పంచ్ అంబిరి రాజేందర్, సీని యర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ సిరిపల్లి కృష్ణ, లైన్‌ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణరావు, లైన్‌మెన్ ఓదెలు ముదిరాజ్, నాగరాజు, సిబ్బంది, సంతు, సునీల్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

## రంజాన్‌కు అన్ని వసతులు కల్పించాలి

సిరిసిల్ల, జనవరి 21: రానున్న రంజాన్ పండుగకు ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రంజాన్ సందర్భంగా జిల్లాలోని వివిధ



శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు లతో, అన్ని మసీద్ కమిటీల అధ్యక్షులు, మైనార్టీ సంఘం ప్రతినిధుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రంజాన్ సందర్భంగా జిల్లాలోని సిరి సిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, ఆయా గ్రామపంచాయతీల పరిధి లోని అన్ని మసీద్‌లు, ఈద్గాల వద్ద ప్రతి రోజు తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిత్యం పారిశుధ్య పనులు చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని మున్సిపల్, గ్రామపంచాయతీ, సెస్ అధికారులను ఆదేశించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖా ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిం చాలని, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ కావాల్సిన మరమ్మ తులు, అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. పౌర సరఫ రాల శాఖ ఆద్వర్యంలో రేషన్ సరుకులు, సిలిండర్లు అందుబాటు లో ఉంచాలని సూచించారు. ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ కోసం ముందస్తుగా సమావేశం నిర్వహించిన అధికారులకు మైనార్టీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజే శారు. కబ్రస్తాన్లలో భారీ వృక్షాలను తొలగించాలని, పరిసరాలు శుభ్రం చేయాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, సిరిసిల్లలో స్లాటర్ హౌస్ నిర్మించాలని, ప్రతిమూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పా టుచేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారం అం దించాలని మసీద్ కమిటీల అధ్యక్షులు కోరారు. సమావేశంలో అడిష నల్ ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి భారతి పాల్గొన్నారు.

## వడ్డీ లేని రుణాల పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలి

ఆసిఫాబాద్, జనవరి 21): ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం చేపట్టిన వడ్డీ లేని రు ణాల పథకంలో పట్టణ మ హిళా సంఘాల సభ్యులకు రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని ఉపముఖ్య మంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మం త్రి దనసరి అనసూయ(సీతక్క), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ ముఖ్య కార్యనిర్వ హణ అధికారి దివ్యదేవరాజన్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవితో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మెప్మా అధికారులు, బ్యాంకు అధికారులతో వడ్డీ లేని రుణాలు, ఇంది రమ్మ చీరల పంపిణీ అంశాలపై సమీక్షా సమావే శం నిర్వహించారు.

## నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు

పెద్దపల్లి టౌన్, జనవరి 21: నిరుపేదలందరికి విడుతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్లు పనులు ప్రారంభించి ప్రొసిడింగ్‌లు అందజేసిన అనం తరం మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెర వేరుతోందని, అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని హామీఇచ్చారు. పట్టణంలో అనేక మంది సొంతిల్లు లేని పేద ప్రజలు ఉన్నారని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పేరిట పేదలను మోసం చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డులు అందజేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ నిరంతరంగా కొనసాగుతోందన్నారు. జిల్లా కేంద్రంలో బస్సు డిపో, బైపాస్ రోడ్డు, 50 పడకల నుంచి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఆధునికీకరణ, కోర్టు భవనం అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏఈ, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపోల్స్ టికెట్ల వేట

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 21మున్సి పల్ ఎన్నికలకు సంబంధించిన వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు కావటంతో జిల్లాలో ఆయా పార్టీల్లో రాజకీయ సమీకరణలు తెరపైకి వచ్చాయి. ఈ సారి మున్సి పల్ ఎన్నికల్లో పోటీ పార్టీల మధ్య కంటే పార్టీల లోపలే ఎక్కువగా కన్పిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి టికెట్ల కోసం ఆశావహుల కదలికలు ముమ్మరమయ్యాయి. నాలుగురోజుల క్రితం జిల్లా కేంద్రంలో రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన చైర్మన్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ప్రకటించారు. దీంతోటికెట్టు కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

సామాజిక సమీకరణాలే కీలకం..

రిజర్వేషన్ అనుకూలంచని వారు తమకు అనుకూలంగా ఉ న్న ఇతర వార్డుల నుంచి బరిలో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధిత పార్టీ నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆశావహుల సంఖ్య పెరుగుతుండటంతో పోటీ పెరిగింది. టికెట్లు దక్కించుకునేందుకు ఆశావహులు పార్టీ కార్యాలయాలు, జిల్లా స్థాయి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు నేతలు ఇప్పటికే తమకు అనుకూలంగా ఉన్న వార్డుల్లో పలుకరింపులు ప్రారంభించి అనధికారికంగా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మరో వైపు రిజర్వేషన్ల నేపథ్యం లో కొన్ని వార్డుల్లో సామాజిక వర్గాలు లెక్కలు కీలకం గా మారాయి. అధికార కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్స రాల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను నమ్ము కుంది. బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల కాలంలో తా ము చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. బీజేపీ మాత్రం పట్టణ ఓటర్లపై దృష్టి పెట్టి సంస్థాగత బలాన్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

జిల్లాలో రెండు మున్సిపాల్టీలో మహిళలకు 50 శాతం టికెట్ల కేటాంచారు. బీఆర్ఎస్ పార్టీలోని సీనియ ర్ నాయకులకు ఈసారి రిజర్వేషన్ అనుకూలించక పోవటంతో వారు ఇతర వార్డుల్లో అన్వేషణలో పడ్డారు. మరోవైపు యువత, మహిళలు, తొలిసారి రాజకీయాల్లో వస్తున్న వారికి అవకాశాలు కల్పించాలనే యోచనలో బీఆర్ఎస్ పార్టీ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ పార్టీలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఉండటం, అధిష్ఠానం ఇరువురిలో బీ ఫాం ఎవరికి ఇస్తారన్నది ఇక్కడ అందరిలోను టెన్షన్ పెరిగింది. ఈ సమస్యకు ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే పరిష్కరించాలని సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఉండటం ఇక్కడ బీఆర్ఎస్‌కు ప్లస్ అయ్యే అవకాశాలున్నాయి.

ముందస్తు మంతనాలు..

కాంగ్రెస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ దండే విఠల్ పూర్తిగా భుజస్కందాలపై వేసుకొని అభ్యర్థుల ఎంపిక చేస్తున్నారు. 30 వార్డుల్లో పక్కాగా గెలుపొందే వారికి ఎంపిక చేస్తున్నారు. రిజర్వేషన్ అనుకూలించిన వారితో ముందస్తుగానే మంతనాలు జరిపి పక్కగా సపోర్టు చేస్తామని స్పష్టంగా హామీ ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సుగుణ టికెట్టు వ్యవహారాలపై కూడా వాకాబు చేస్తున్నారు. మున్సిపల్ పోరులో జిల్లా నుంచి మెజార్టీ కౌన్సిలర్ స్థానాలు గెల్పించుకొని చైర్మన్ స్థానాన్ని సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

కొత్త ముఖాలను దింపేందుకు..

బీజేపీ పరిస్థితి పరిశీలిస్తే జిల్లాలో సిర్పూరు ఎమ్మె ల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మున్సిపల్ ఎన్నికల ను సవాలుగా తీసుకుంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు దీటైన అభ్యర్థులు, కొత్త ముఖాలను దింపేందుకు పక్కాగా వ్యూహం వేస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో బీజేపీకి పట్టు ఉండే వార్డులను లెక్కలేసుకుంటూ పక్కాగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి తొలిసారి ఎన్నికలు కావ టం, కాగజ్‌నగర్ మున్సి పాలిటీకి మూడోసారి ఎన్నికలు జరుగుతుం డగా మహిళ చైర్‌పర్సన్‌కు రిజర్వేషన్ కేటాయించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆసిఫాబాద్, జనవరి 21: రాష్ట్ర అభివృది?ధ,ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ, సంక్షేమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతి, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రూ.26 కోట్ల నిధులతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను చేపడుతోందన్నారు. జిల్లాలో విద్యా, వైద్య అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవలక్ష్మి, కలెక్టర్ హరిత, డీసీసీ అధ్యక్షురాలు సుగుణ, నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఇరుకుల్ల మంగ ప్రమాణస్వీకారం చేశారు. ఎ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో జిల్లా మార్కెటింగ్ అదికారి అశ్వక్ అహ్మద్ ప్రమాణస్వీకారం చేయించా రు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ గా రవీందర్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, రేఖ శ్యామ్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నాయ కులు బాలేశ్వర్‌గౌడ్, చరణ్, నిజాం పాల్గొన్నారు.

## తెలంగాణలో భారీగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

హైదరాబాద్: తెలంగాణలో భారీగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. రాష్ట్రంలో 47 మందిని బదిలీ చేస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది

. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు ఇచ్చింది.



# మహానగరంలో 'ట్రాఫిక్' మాయ

వరంగల్  హైదరాబాద్ తర్వాత వరంగల్, హనుమకొండ, కాజీపేటతో కూడిన త్రినగరి పెద్దది. ఇక్కడ రోజురోజుకు ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. వాణిజ్య సముదాయాలు, ప్రధాన కూడళ్లలో వాహనాలు నిలపడానికి పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతుండటంతోపాటు వాహనదారులకు జరిమానాలు తప్పడం లేదు. వరంగల్ మహా నగరంగా మారిన అనంతరం వాహనాల సంఖ్య మూడింతలు పెరిగింది. ఈ క్రమంలో భారీ, నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలతో కొత్త సమస్యలొస్తున్నాయి. ఉదయం, సాయంత్రం ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రభుత్వ అధికారులు దృష్టి పెట్టకపోతే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం కానుంది.

ప్రతిపాదనలకే పరిమితం..

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో పార్కింగ్ జోన్లు లేవు. ఐదారేళ్లుగా ప్రతిపాదనలు రూపొందిస్తున్నా కార్యరూపం దాల్చలేదు. వాహనదారులు షాపింగ్, హోటళ్లు, రెస్టారెంట్లకు వచ్చినవారు రోడ్ల మీదే వాహనాలు నిలుపుతుండటంతో సమస్య ఎక్కువవుతోంది. పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నగర పాలక సంస్థపై ఉంది. ట్రాఫిక్ పోలీసులు, నగర పాలక సంస్థ మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. త్రినగరిలో ముఖ్య కూడళ్ల వద్ద నడిచివెళ్లే వారికోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ప్రైవేటు సంస్థలు, చిరువ్యాపారులు దర్జాగా వాడుకుంటున్నారు.

సెల్లార్ల మూసివేత

నగరంలోని వ్యాపార, వాణిజ్య కూడళ్లలో సెల్లార్లను అధిక సంఖ్యలో మూసేశారు. వాణిజ్య భవనాల్లో నిబంధనలను అతిక్రమించి సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. కొత్తగా ప్రారంభించిన వ్యాపార సముదాయాల్లో కొన్నింటికి అసలు పార్కింగ్ స్థలాలు లేవు.

పెరుగుతున్న వాహనాలు

ఉమ్మడి జిల్లాకు వరంగల్ నగరమే ప్రధాన వ్యాపార, వాణిజ్య కేంద్రం. అన్ని జిల్లాల నుంచి రోజూ 1.50 లక్షల మంది వచ్చి వెళ్తుంటారు.

వరంగల్ మహానగర పరిధిలో 40 వేలకుపైగా ఆటోలు ఉన్నాయి. నాన్ సిటీ పర్మిట్ కలిగిన ఆటోలు 5 వేల వరకు వచ్చి వెళ్తుంటాయి.

కొవిడ్ తర్వాత నాలుగు చక్రాల వాహనాల సంఖ్య నాలుగింతలైంది. ప్రస్తుతం నగరంలో రోజూ 30 వరకు కార్ల అమ్మకాలు జరుగుతున్నాయి. ఏటా 4-5 వేల వాహనాలు రోడ్డెక్కుతున్నాయి.

రోజూ 100 నుంచి 120 వరకు ద్విచక్ర వాహనాల అమ్మకాలు జరుగుతున్నాయి. ఏటా 10-15 వేల వాహనాలు రహదారులకు మీదకు వస్తున్నాయి.




# ఏటీఎంలో నగదు కాజేస్తున్న నిందితుల అరెస్టు

రంగశాయిపేట, ఏటీఎంలో డబ్బులు తీసుకునే ఖాతాదారులను ఏమార్చి నగదు అపహరిస్తున్న ఇద్దరు నిందితులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మట్టెవాడ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ శుభం ప్రకాశ్ నిందితుల వివరాలు వెల్లడించారు. హనుమకొండ జిల్లా కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన ఎస్‌కే సెక్యూరిటీ సర్వీసెస్ సూపర్‌వైజర్ కె.వెంకటేశ్వర్లు ఈ నెల 13న వరంగల్ శంభునిపేటలోని ఏటీఎంకి సర్వీస్ కోసం వెళ్లగా.. తలుపు తెరిచి ఉంది. మిషన్ పరిశీలించగా.. లోపలి నుంచి బ్లాక్ స్ట్రిప్ ప్లాస్టర్‌తో అతికించి ఉంది. వెంటనే విషయాన్ని బ్యాంకు అధికారులకు చెప్పారు. అనంతరం సీసీ ఫుటేజీ పరిశీలించగా.. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎంలోకి వచ్చి బ్లాక్ స్ట్రిప్ అడ్డుపెట్టినట్లు తేలింది. ఖాతాదారులు నగదు తీయడానికి ప్రయత్నిస్తే.. విత్‌డ్రా అయినట్లు చరవాణికి సమాచారం వచ్చినా.. ఏటీఎం నుంచి డబ్బులు రావు. కొద్దిసేపు చూసి వారు వెళ్లాక.. వెంటనే నిందితులు లోపలికి వెళ్లి నగదు తీసుకుంటున్నారు. ఈ ఘటనపై మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరీంనగర్‌లోనూ నేరాలు..

మంగళవారం వరంగల్- ఖమ్మం ప్రధాన రహదారిపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు రంగశాయిపేట వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. మోసాలు బయటపడ్డాయి. నిందితులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, కాన్పూర్‌నగర్ జిల్లాకు చెందిన వినయ్‌కుమార్, వినీత్‌కుమార్‌గా గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.1.27 లక్షలు, రెండు చరవాణులు, ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నారు. వీరు కాజీపేట ఏరియాలో-4 చోట్ల, కరీంనగర్‌లో-3 చోట్ల, వరంగల్‌లో-2 చోట్ల నేరాలకు పాల్పడినట్లు వివరించారు. నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ సీఐ రమేష్, ఎస్సై సురేష్, శ్రావణ్‌కుమార్ తెలిపారు.

# మావోయిస్టుల స్థావరాలపై ఆధిపత్యం సాధించాం

వెంకటాపురం,మావోయిస్టుల రహస్య స్థావరాలైన అటవీ ప్రాంతాలపై ఆధిపత్యం సాధించామని సౌత్ సెక్టార్ సీఆర్పీఎఫ్ ఐజీ టి.విక్రమ్ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్య ప్రాంతమైన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కర్రెగుట్టపై పామునూరులో ఏర్పాటు చేసిన ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్‌ఓబీ) క్యాంపును మంగళవారం ఆయన ప్రారంభించారు. క్యాంపు ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మావోయిస్టులకు కంచుకోటగా భావిస్తున్న కర్రెగుట్టలపై పైచేయి సాధించామన్నారు. కీకారణ్యంలోని ఎత్తైన కొండపై వెయ్యి మంది భద్రతా సిబ్బందితో ఎఫ్‌ఓబీ ఏర్పాటు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వాజేడు మండలం మురుమూరు క్యాంపుతో మావోయిస్టుల కదలికలు అదుపులోకి వచ్చాయని, పామునూరు ఎఫ్‌ఓబీతో ఇక్కడా పైచేయి సాధిస్తామని పేర్కొన్నారు. కర్రెగుట్టలను పూర్తిస్థాయిలో ఆధీనంలోకి తెచ్చేందుకు పామునూరు కేంద్రంగా అటవీ ప్రాంతంలోని జెల్లా, డోలి, తడపలకు రహదారి సౌకర్యం మెరుగుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. పామునూరులో నివసిస్తున్న ఏడు కుటుంబాలకు చెందిన 23 మంది గిరిజనులు మైదానానికి వెళ్లేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించామన్నారు. మావోయిస్టు ఉద్యమానికి భవిష్యత్తు లేదని భావించిన అగ్రశ్రేణి నాయత్వం లొంగుబాటు బాట పట్టారని, అడవుల్లో మిగిలి ఉన్నవారు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ డీఐజీ అనిల్ మిన్జ్, కమాండెంట్లు ప్రశాంత్‌కుమార్ శ్రీవత్సవ, ముఖేశ్, ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్‌భూట్, డీఎస్పీ బీవీ ప్రశస్థ, వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్, ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

# రొటేషన్‌తో.. పక్క చూపులు.. గెలుపు గుర్రాల అన్వేషణలో పార్టీలు

జనగామ,  పుర ఎన్నికల్లో ఈ సారి వార్డు రిజర్వేషన్లకు రొటేషన్ విధానాన్ని అనుసరించడం ఆశావహులు.. వివిధ పార్టీలకు చిక్కులు తెచ్చిపెట్టింది. జనగామ మున్సిపల్ అధ్యక్ష పీఠం గత ఎన్నికల్లో జనరల్ మహిళకు కేటాయించగా, ఈ దఫా బీసీ జనరల్‌కు దక్కింది. 30 వార్డుల్లో గతంలో ఎస్టీ వార్డును ప్రస్తుతం ఎస్సీ వార్డుగా మారింది. రిజర్వ్‌డ్ వార్డులు జనరల్ కోటాలో చేరాయి. 1-12 వార్డుల్లో ఎక్కడ అన్ రిజర్వ్‌డ్ కేటగిరీకి దక్కలేదు. గతంలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలు అధికంగా ఉన్న వార్డులు జనరల్ అయ్యాయి. 27వ వార్డు తప్ప అన్ని వార్డుల్లో మార్పులు జరిగాయి.



గత రెండు పర్యాయాలు జనగామ మున్సిపల్‌ను భారాస దక్కించుకుంది. పట్టు కాపాడుకునేందుకు బలమైన జట్టు కోసం ఎమ్మెల్యే పల్లా ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నారు. జనరల్ వార్డుల్లో రెడ్డి సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించేందుకు ఇద్దరు నాయకులను సుదూర వార్డుల్లో పోటీకి దింపేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్ని వార్డుల్లో బలమైన అభ్యరులు లేకపోవడంతో ఇతర వార్డుల నుంచి ఎంపికకు ప్రయత్నిస్తున్నారు. ఇష్టం లేకున్నా, పార్టీ కోసం పోటీకి సిద్ధం కావాలని ఒప్పించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా వార్డుల నుంచి పోటీకి సిద్ధపడిన వారి స్తోమత, వార్డుల్లో వారికి ఆదరణ, మాజీ కౌన్సిలర్లలో వారి వార్డుల్లో పరపతి గురించి సర్వే నిర్వహించినట్లు సమాచారం.

ప్రజా పాలన, సంక్షేమ పథకాలతో కాంగ్రెస్‌కు ప్రజాదరణ దక్కుతోందనే అంచనాతో ఆ పార్టీ నుంచి టిక్కెట్‌కు పోటీ పెరిగింది. ఆశావహులు సోమవారం జనగామ నియోజకవర్గ కార్యాలయంలో కొమ్మూరిని కలిసి దరఖాస్తులు సమర్పించారు. టిక్కెటు కోసం ఎవరి ప్రయత్నంలో వారు ఉన్నారు. డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి, కొమ్మూరికి ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఎవరికీ స్పష్టమైన హామీ ఇవ్వకుండా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధిష్ఠానానికి పంపించనున్నారు. మిత్రపక్షం సీపీఎం నాలుగు వార్డులకు పట్టుబడుతోంది.

గత ఎన్నికల్లో 30 వార్డుల్లో పోటీ చేసి 4 వార్డుల్లో గెలిచిన భాజపా ఈసారి అన్ని వార్డుల్లో పోటీకి సిద్ధమవుతోంది. వార్డుల వారీగా అర్జీలు వచ్చాయని జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ తెలిపారు.

జనరల్ వార్డుల్లో ఎస్సీ ఓటర్లు అధికంగా ఉన్న చోట, రిజర్వ్‌డ్ వార్డుల్లో మైనార్టీ ఓటర్లు అధికంగా ఉన్న వార్డుల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని లేకపోతే తామే అభ్యర్థులను పోటీకి దింపాలని కొన్ని సామాజిక వర్గాలు జట్టుగా కలిసినట్లు తెలుస్తోంది.



# నాణ్యమైన ఆహారం.. కేయూ ఒప్పందం

విద్యానగర్,  ములుకనూర్ సహకార సొసైటీ ఉత్పత్తి చేస్తున్న సరకులు కాకతీయ విశ్వవిద్యాలయంలోని వసతి గృహాలకు, అనుబంధ మెస్‌లకు సరఫరా కానున్నాయి. ఇటీవల ఇరువర్గాల అధికారులు ఇందుకు సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. దీంతో క్యాంపస్‌లోని మెస్‌లకు పాలు, పెరుగు, బియ్యం సరఫరా కానున్నాయి. గతంలో టెండర్ ద్వారా గుత్తేదారుడు సామగ్రిని పంపిణీ చేసేవారు. వాటిలో నాణ్యత లేకపోవడంతోపాటు నాసిరకమైన ఉత్పత్తులు వచ్చేవి. దీనిపై విద్యార్థులు పలుమార్లు వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ములుకనూర్ సహకారం సంఘంతో ఒప్పందం కుదిరింది.

ఐదు మెస్‌లకు సరఫరా

కేయూ క్యాంపస్ పరిధిలో 19 వసతి గృహాలు ఉండగా, వీటికి అనుబంధంగా ఐదు మెస్‌లను నిర్వహిస్తుంటారు. ఇందులో పద్మాక్షి, న్యూపీజీ, ఇంజినీరింగ్, లా, కామన్ మెస్‌లున్నాయి. దాదాపు 4,500 మంది విద్యార్థులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. రోజువారీ ఆహారంలో భాగంగా పాలు, పెరుగు, బియ్యం ఈ సొసైటీ ద్వారా సరఫరా కానున్నాయి. పాలు రోజుకు 250 లీటర్ల చొప్పున నెలకు 7,500 లీటర్లు, పెరుగు రోజుకు 400 కిలోల చొప్పున నెలకు 1.20 టన్నులు, బియ్యం నెలకు 350 క్వింటాళ్లు సరఫరా కానున్నాయి. గతంలో గుత్తేదారు సరఫరా చేసిన సామగ్రి నాణ్యంగా లేకపోవడంతోపాటు వ్యయం కూడా అధికమయ్యేది. ప్రస్తుతం ముల్కనూర్ ఒప్పందం తర్వాత దాదాపు రూ.2 లక్షల వరకు ఆదా అవుతుందని వసతి గృహాల సంచాలకుడు ఎల్వీ రాజ్‌కుమార్ తెలిపారు. నాణ్యమైన పాల ఉత్పత్తులతోపాటు బియ్యం కూడా సరఫరా కావడంతో విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# అక్రమార్కుల చెరలో శిఖం భూములు

భూపాలపల్లి, అటవీ సమీప గ్రామాల్లోని చెరువులు, కుంటల శిఖం భూములు అన్యాక్రాంతమవుతోన్నాయి. అధికారుల అలసత్వంతో కబ్జాదారులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. నీటి పారుదలశాఖ రికార్డుల ప్రకారం చెరువుల విస్తీర్ణం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. రికార్డులకు, వాస్తవంగా ఉన్న భూమికి పొంతన లేకుండా ఉంటోంది. చాలాచోట్ల రోజురోజుకు చెరువు శిఖం భూములు కబ్జాకోరల్లో చిక్కుకుంటున్నాయి. తాజాగా జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం నేరడుపెల్లి శివారు కొత్తపల్లి గ్రామ



సమీపంలోని చిన్నమద్దెలకుంట, పెద్దమద్దెలకుంట రెండు చెరువుల శిఖం భూములపై పలువురు కన్నేశారు.

తొమ్మిదెకరాలు..

ఈ చెరువుల కింద 75 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండగా.. పలువురు రైతులు సాగులో ఉన్నారు. కొన్నేళ్లుగా చెరువుల శిఖం భూములపై కొందరు వ్యక్తులు కన్నేసి కబ్జాకు పాల్పడుతున్నారు. చిన్నమద్దెలకుంట చెరువు శిఖం భూములు రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎనిమిది ఎకరాల వరకు ఉంటే, ఇందులో నాలుగు ఎకరాల వరకు అన్యాక్రాంతమైంది. అదేవిధంగా పెద్ద మద్దెలకుంట శిఖం భూములు దాదాపుగా 13 ఎకరాలు ఉండాలి. అయితే ఇందులో 5 ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని ఆయకట్టు రైతులు ఆరోపించారు. తొమ్మిది ఎకరాల వరకు కబ్జాలో చిక్కుకున్నట్లు రెండు రోజుల క్రితం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రూ.కోటి అంచనా..

అన్యాక్రాంతమైన భూముల్లో వ్యవసాయం కోసం ట్రాక్టర్లతో చదును చేయడంతో చెరువుల్లో పూడిక పేరుకుపోయిందని కర్షకులు తెలిపారు. వరి పంటలు కోతకొచ్చే సమయంలో సాగు నీరందక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు పుట్టపాక శంకర్, శ్రీకాంత్, సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎకరం విలువ రూ.10 లక్షలకు పైగా ధర పలుకుతోంది. కబ్జాకు గురైన భూమి విలువ దాదాపు రూ.కోటి ఉంటుందని అంచనా. ఇప్పటికైనా నీటి పారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి, శిఖం భూములను కాపాడాల్సిన అవసరం ఉంది. అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకుని హద్దులు నిర్ణయిస్తేనే చెరువులకు రక్షణ ఉండనుంది.

క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం..

రెండు చెరువుల శిఖం భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. రెండు రోజుల్లో రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి చెరువులకు హద్దులు ఏర్పాటు చేస్తాం. భూమి ఆక్రమణకు గురైతే స్వాధీనం చేసుకుంటాం. సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఎవరిని ఉపేక్షించం.

# వాగుల్లో దొంగలు పడ్డారు

డోర్నకల్, మున్నేరు, ఆకేరు వాగుల్లో దొంగలు పడ్డారు.. పగలు రాత్రిళ్లు ఇసుక దోపిడీ చేస్తున్నారు. అధికారుల రాక గురించి ముందస్తు సమాచారం అందుతుండటంతో అప్రమత్తమవుతూ అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. మున్నేరు వాగు పరివాహకంలోని కొత్తదుబ్బతండా, డోర్నకల్, ఉయ్యాలవాడ, వెన్నారం, అమ్మపాలెం, బంజర, ఆకేరు ప్రవహించే మోద్గులగడ్డతండా, అందనాలపాడు, చిల్కోయలపాడు, ముల్కలపల్లి వద్ద ఈ దందా మూడు ట్రాక్టర్లు, ఆరు ట్రిప్పుల మాదిరి కొనసాగుతుంది.



డోర్నకల్ మీదుగా ప్రవహించే మున్నేరు వాగులో నుంచి ఉదయం 4 నుంచి 6 గంటల లోపు ఇసుక రవాణా అవుతుంది. ముల్కలపల్లి మీదుగా ప్రవహించే ఆకేరు వాగులో నుంచి రేయింబవళ్లు ఇసుక తరలుతోంది. ఈ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు, రెవెన్యూ అధికారులు దృష్టి సారించడం లేదు. అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు.

పొలాలు, ఖాళీ స్థలాల్లో డంపులు

కొందరు వాగుల్లోకి ట్రాక్టర్లు తీసుకెళ్లి ఇసుక నింపి నేరుగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. మరి కొంత మంది సమీప పొలాలు, ఖాళీ స్థలాల్లో డంపులు నిల్వ చేసుకుంటున్నారు. మున్నేరు వాగు ఇసుకను స్థానిక కట్టడాల అవసరాలకు విక్రయించుకుంటుండగా ఆకేరు వాగు ఇసుక ఖమ్మం జిల్లాలోకి తరలుతుంది. వాగుల్లోకి ట్రాక్టర్లు వెళ్లేలా పలుచోట్ల దారులు ఏర్పాటు చేసుకున్నారు. కింది స్థాయి సిబ్బంది పట్టుకున్నప్పుడు వ్యాపారులు పైనుంచి ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఉన్నత స్థాయి అధికారులు దాడులు ముమ్మరం చేస్తే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుంది

భూగర్భ జలంపై ప్రభావం

డోర్నకల్ పరిసర ప్రాంత రైతులకు వర్షాధారిత వ్యవసాయమే దిక్కు. వాగుల్లోని ఇసుక తోడేస్తుండటంతో కొద్దిపాటి భూగర్భ జల వనరులు అడుగంటి పోతున్నాయి. వాగులో నీరు నిల్వ ఉన్న చోట్ల పైపులు అమర్చుకుని పంటలకు నీరు పారించుకోవడం తప్పితే మరేం చేయలేని నిస్సహాయ స్థితి నెలకొంది.

ఆకేరు, మున్నేరు వాగుల పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణ జరగకుండా తగిన చర్యలు చేపడుతామని డోర్నకల్ తహసీల్దారు రాఘవరెడ్డి పేర్కొన్నారు.

# యాసంగి సాగు ఎలాగండి?



ే, చందుర్తి : యాసంగి సీజన్‌లో భాగంగా వరి నాట్లు దాదాపు పూర్తి కావొచ్చాయి. చందుర్తి మండలంలో ఎక్కువ శాతం రైతులు వరిపై ఆధారపడి ఉన్నారు. మండలంలో కొన్ని చెరువులు ఇప్పటికే ఎండిపోయాయి. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే ముమ్ముందు ఎలా ఉంటుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విన్నవించినా ఫలితం సున్నా!

చందుర్తి మండలం తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో రైతులు సాగు నీటికి ఏటా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందుర్తి రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా అటవీని ఆనుకొని రామన్నపేట మీదుగా తిమ్మాపూర్ శివారులోని కొత్త చెరువు వరకు కాలువ ప్రతిపాదనలు ఉన్నాయి. కాలువ తవ్వకానికి భూసేకరణ జరగక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కొన్నేళ్లుగా రైతులను ఒప్పించి కచ్చ కాలువలను తవ్వించి తిమ్మాపూర్ కొత్త చెరువును నింపారు కానీ.. రామన్నపేట వద్ద కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. మరమ్మతు చేసి చెరువులు నింపాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వ విప్ హామీ..

జోగాపూర్ పంపుహౌస్ నుంచి వెళ్లే ప్రధాన కాలువకు లిఫ్ట్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి శివారులోని కొత్త చెరువును నింపాలనేది రైతుల ప్రతిపాదన. ఈ చెరువు నిండితే చుట్టూ నాలుగు గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది. కొత్త చెరువు నింపేందుకు అధికారులతో ప్రణాళికలు చేసి శాశ్వత పరిష్కారం చూపుతానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ పనులు పూర్తయితే సాగుకు సమస్య ఉండదు.

నిర్వహణ కరవై..

ఎత్తిపోతల పథకంలో పంపుహౌస్‌ల నిర్మాణంతో పాటు మేజర్, మైనర్ కాలువల నిర్మాణానికి ఒప్పందం ఉండగా, భూసేకరణ, పరిహారం పంపిణీలో జాప్యంతో చందుర్తి, రుద్రంగి మండలాల్లో కాలువల పనులు అసంపూర్తిగా వదిలేశారు. అసంపూర్తి పనులు ఒకవైపు.. నిర్వహణ లేక మరోవైపు తూములు, డ్రాపులు మట్టితో కూరుకుపోయాయి. పూడిక, చెట్ల తొలగింపు లేక కాలువలు అధ్వానంగా మారాయి.

కాలువల నిర్వహణను గుత్తేదారు మధ్యలోనే వదిలేయడాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎల్లంపల్లి కాలువల మరమ్మతుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేయిస్తాం.

# కన్నయ్య్ గుట్టకే కన్నం

రఘునాథపల్లి  రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి శివారులోని 241 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమిలోని ఎర్రబోడు గుట్టను రెండేళ్లుగా ఎటువంటి అనుమతులు లేకుండానే తవ్వి తరలించుకుపోగా.. తాజాగా మండలంలోని గోవర్ధనగిరి



శివారులోని గోపాలస్వామి గుట్టకు అక్రమార్కులు కన్నం వేశారు. ఆ గుట్ట సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో.. అశ్వరావుపల్లి, మిదికొండ, గోవర్ధనగిరి గ్రామాల సరిహద్దుల వరకు విస్తరించి ఉంది. ఈ నేపథ్యంలో ఆ గుట్టతోపాటు దాని వెనుక వైపు ఉన్న 'జాలు గుండు' గుట్ట ప్రాంతంలోని 228 సర్వేనెంబర్‌లో భూమిపై అక్రమార్కుల కన్నుపడింది. గుట్టల వెంట ఉన్న పట్టా భూములను వ్యవసాయోగ్యంగా మార్చుకునే హక్కు రైతులకు ఉన్నప్పటికీ అందులోని మట్టిని అమ్ముకునేందుకు ప్రభుత్వానికి ట్రిప్పుల వారీగా రుసుము చెల్లించి, అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అక్రమార్కులకు అవేవీ పట్టించుకోకుండా.. జేసీబీలతో విచ్చలవిడిగా మట్టిని తవ్వి లారీల్లో తరలిస్తున్నారు. ఒక్కో ట్రిపునకు రూ.5 వేల చొప్పున అమ్ముకుంటున్నారు. ఇలా ఏడాది కాలంగా.. ఆరు మీటర్ల లోతు.. ఐదు ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలు జరిపారు. వెయ్యి ట్రిప్పులకు పైనే తరలించినట్లు సమాచారం. ఈ నెల 14న.. పోలీసులు దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేయడంతోపాటు రెండు మట్టి టిప్పర్లు, ఒక జేసీబీ యంత్రాన్ని స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

ప్రభుత్వం చేపట్టిన పనులు ధ్వంసం..:

మట్టి తరలింపులో అక్రమార్కులకు అడ్డు అదుపూలేకుండా పోతోంది. గుట్ట పరివాహక ప్రాంతం నుంచి నీటిని చెరువుల్లోకి మళ్లించేందుకు ప్రభుత్వం నాబార్డు నిధులతో చేపట్టిన ఫీడర్ ఛానల్‌ను, ఉపాధి హామీ పథకం కింద గుట్ట చుట్టూ నిర్మించిన నీటి నిల్వ కందకాలను ధ్వంసం చేసి మట్టిని తరలించుకుని వెళ్లారు. దాంతోపాటు ఉపాధి కూలీలు నిర్మించిన చిన్న నీటి కుంటలోకి నీరు రాకుండా చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ఫణికిశోర్ మాట్లాడుతూ.. ఇకపై గుట్టలను పర్యవేక్షించే బాధ్యతను గ్రామ పాలనాధికారులు(జీపీఏ)లను అప్పగించాం. ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వీటి ధరలు వింటే దడే

, ముత్తారం ఒకవైపు కూరగాయల ధరలు, మరోవైపు మాంసాహార ధరలు పెరగడంతో మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర నిరాశలో ఉన్నాయి. ఆరోగ్యానికి మేలు చేసే గుడ్డు తినలేని పరిస్థితి నెలకొంది. కోడి మాంసం ధర విపరీతంగా పెరిగి సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి.



60 శాతం పెరిగిన గుడ్డు ధర

కొద్ది రోజుల కిందటివరకు రిటైల్ మార్కెట్‌లో రూ.5గా ఉన్న కోడిగుడ్డు ధర.. ప్రస్తుతం రూ.8కి చేరింది. దీంతో 30 గుడ్ల ట్రే ధర రూ.150 నుంచి రూ.240కి పెరిగింది. ఇది గతంతో పోలిస్తే సుమారు 60 శాతం ధర పెరుగుదల కన్పిస్తోంది. మారుమూల గ్రామాల్లో కొన్నిచోట్ల గుడ్డును రూ.9 లకు విక్రయిస్తున్న పరిస్థితి నెలకొంది.

కిలో రూ.320

కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని ఫారం నిర్వాహకులు చెబుతున్నారు. చలికాలంలో కోళ్ల ఫారాల్లో గుడ్ల ఉత్పత్తి సాధారణంగా తగ్గుతుంది. ఈసారి మాత్రం ఉత్పత్తి పడిపోయింది. ఫలితంగా గుడ్లకు డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సంక్రాంతి ముగిసి మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న వేళ కోడిమాంసం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే చికెన్ ధరలు కిలోకు రూ.320 ఉంది. జాతర నాటికి రూ.350 దాటే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

తగ్గిన అమ్మకాలు

మేక, గొర్రెల ధరలు అధికంగా ఉండటంతో.. మాంసాహారం కోసం కోళ్లపై ఆధారపడే పేద, మధ్యతరగతివారు ఇప్పుడు చికెన్ కొనాలంటేనే ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. కోడిమాంసం, గుడ్డు ధరలు ఆకాశాన్ని అంటడంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పెరగడంతో గుడ్ల అమ్మకాలు గణనీయంగా తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో రోజువారీ కూలీలు విరివిగా గుడ్లు కొనుగోలు చేసేవారని.. ప్రస్తుతం ఇతర ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారని చెబుతున్నారు.

# ఎన్నికల వేళ.. కాసుల కళ

చొప్పదండి పురపాలక సంఘాల్లోని మహిళా సంఘాలకు గతంలో తీసుకున్న రుణాల వడ్డీ డబ్బులను విడుదల చేస్తూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. 2023–24, 2024–25 సంవత్సరాల్లో పట్టణాల్లోని మహిళా సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించిన ఈ వడ్డీ డబ్బులను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని ఆదేశాలు ఇచ్చింది.

ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ



ఇప్పటికే నిధులు విడుదల కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ ప్రక్రియ మొదలుపెట్టారు. కరీంనగర్ నగరపాలక సంస్థ మినహా చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట పురపాలికలకు సంబంధించిన మహిళా సంఘాలకు ఈ డబ్బులు విడుదల చేశారు. ఈ మూడు పురపాలికల పరిధిలోని 920 సంఘాలకుగాను సుమారు రూ.3.44 కోట్లు విడుదలయ్యాయి. ఎన్నికల పుణ్యమా అని ఈ నిధులు విడుదల కావడంతో మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరీక్షణకు తెర...

గత రెండేళ్లుగా ఈ డబ్బుల కోసం మహిళా సంఘాల సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఎప్పుడొస్తాయని అధికారులను పదేపదే అడిగే వారు. పురపాలక ఎన్నికల నేపథ్యంలో ఈ డబ్బులు విడుదల కావడంతో వాటిని త్వరితగతిన ఆయా సంఘాల సభ్యులకు పంపిణీ చేసేలా అధికారులు సమాయత్తమమవుతున్నారు.

# మెట్‌పల్లిలో చోరీల కలకలం

మెట్‌పల్లి,  మెట్‌పల్లి పట్టణంలో మంగళవారం ఉదయం గంట వ్యవధిలో రెండు చోట్ల జరిగిన చోరీ ఘటనలు కలకలం రేపాయి. దొంగలు తల్లీ కుమారుడిపై దాడి చేసి మూడున్నర తులాల బంగారు గొలుసు అపహరించడంతో పాటు మరో చోట ప్రభుత్వ ఉద్యోగి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు యత్నించారు. ఎస్సై కిరణ్‌కుమార్, బాధితుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన వన్నెల గంగు, ఆమె కుమారుడు రవి కులవృత్తిలో భాగంగా దుస్తులు ఉతకడానికి ఎస్సారెస్పీ కాలువ సమీపంలోని కళానగర్ దోబీఘాట్ వద్దకు వెళ్లారు. గంగు దుస్తులు ఉతుకుతుండగా, రవి స్నానం చేస్తున్నాడు. ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చి వారిని గమనిస్తున్నారు.



'మీరెవరం'టూ అడుగుతుండగానే ఇద్దరిపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. గంగు మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని పరారయ్యారు. రవి ఎడమ చెంపపై, గంగు తల, కుడి చెవి, ఎడమ దవడ, చేతిపై గాయాలయ్యాయి. అనంతరం రవి ఇచ్చిన సమాచారం మేరకు బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికి మెట్‌పల్లి నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు జూనియర్ టెక్నికల్ అధికారి కల్లోల్ల అభినయ్ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించేందుకు యత్నించారు. ఆయన అప్రమత్తమై చేయి అడ్డుపెట్టారు. వెంటనే చేతిలోని సెల్‌ఫోన్‌ను కూడా లాక్కెళ్లడానికి యత్నించగా, అది కింద పడడంతో దుండగులు పరారయ్యారు. రెండు ఘటనలపై కేసు నమోదు చేసి, దొంగల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# తలకెక్కించుకోకుంటే.. కన్నీరే

ి, సూర్యాపేట, న్యూస్‌టుడే, చిట్యాల: ప్రాణం ఎంతో విలువైనది. మనకు ప్రమాదం ఎదురైనప్పుడే అది గుర్తుకువస్తోంది. నాకు ఏమవుతుంది లే..అనే చిన్న నిర్లక్ష్యం నిండు జీవితాన్ని చీకట్లోకి నెట్టేస్తోంది. వారి కుటుంబాలను కకావికలం చేస్తుంది. అలాంటివి చూసైనా.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది. లేదంటే.



ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏటా రోడ్డు ప్రమాదాలు గుండెలను కలిచివేస్తున్నాయి. మృతులు, క్షతగాత్రుల్లో అధికంగా యువకులే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో గత రెండేళ్లలో 2,989 ప్రమాదాలు జరిగాయి. అందులో 1,265 మంది మృతి చెందగా, 2,725 మంది గాయపడ్డారు. ఇక యాదాద్రి జిల్లా చౌటుప్పల్ ప్రాంతంలో 2025లో జరిగిన 117 ప్రమాదాల్లో 35 మంది మృత్యువాత పడగా 136 మంది గాయాలపాలయ్యారు.

కారణాలు ఇవే: ట్రాఫిక్ నిబంధనలను లెక్కచేయకపోవడం, అతివేగం, నిర్లక్ష్యం, అజాగ్రత్తగా బండి తోలడం, శిరస్త్రాణం ధరించకపోవడం, మద్యం మత్తులో, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం.

నల్గొండ జిల్లా చిట్యాల మండలం పేరేపల్లి గ్రామానికి చెందిన రూపని సాలమ్మ రెండో కుమారుడు రాజశేఖర్(30) 2024 ఆగస్టులో రాఖీ పండగకు ఇంటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సాధారణంగా శిరస్త్రాణం ధరించే రాజశేఖర్ ఆరోజు మరచిపోయాడు. మార్గమధ్యలో గేదెలు అడ్డురావడంతో అదుపుతప్పి చెట్టును ఢీకొని అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఐదేళ్ల క్రితం భర్త రాములు కూడా ప్రమాదంలో చనిపోయాడు.

నేను జాతీయస్థాయి హాకీ క్రీడాకారుడిని. 2025 డిసెంబరులో అమ్మమ్మగారి ఊరైన వర్ధన్నపేటకు వెళ్లా. పనిమీద పక్క ఊరు ఇల్లందకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న బస్సును ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో జరిగిన ప్రమాదంలో కాలును కోల్పోయాను. దీంతో కలల ఆటకు దూరమయ్యాను. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడపాలి.

అధికారయంత్రాంగం రహదారి భద్రతపై మాసోత్సవాలను పెద్దఎత్తున నిర్వహిస్తోంది. చైతన్యపరుస్తున్నా వాహనదారుల్లో పెద్ద మార్పు కనిపించడం లేదు. వారి తీరు ఇతరులకు సైతం ప్రాణసంకటం అవుతోంది. పోలీసుల భయంతో కాదు, తమ కుటుంబాలకు వేదనను మిగల్చకూడదంటే నియమాలు పాటించాలని ప్రమాద బాధిత కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

# గణన తొలిరోజే పులి పంజా

, ఖమ్మం వ్యవసాయం, అశ్వారావుపేట అడవుల్లో జంతుగణన ప్రారంభించిన తొలిరోజు రెండు ఆవులను పులి చంపేసిన ఘటన వెలుగుచూడటంతో అటవీశాఖ సిబ్బంది, ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. అశ్వారావుపేట మండలం కావడిగుండ్లలో సోడెం నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో కట్టేసిన పశువులపై సోమవారం అర్ధరాత్రి అనంతరం పులి దాడి చేసింది. ఒక ఆవు పీక కొరికి చంపేసింది. దాని దూడను చంపి కొంతదూరం లాక్కెళ్లి సగం వరకు తిని వదిలివెళ్లింది. గ్రామస్థులు ఎఫ్ఆర్ఓ మురళికి మంగళవారం ఉదయం సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకొని పులి పాదముద్రలు సేకరించారు. పశువులపై పులే దాడి చేసిందని ఎఫ్ఆర్ఓ నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించిన పశువైద్యుడు వినయ్‌కుమార్ సైతం దీన్ని ధ్రువీకరించారు.

గిరిజన గ్రామాల్లో ఆందోళన

పులి దాడి చేసిన ప్రాంతానికి సమీపంలో ఎనిమిది గిరిజన గ్రామాలు ఉన్నాయి. పులి మళ్లీ ఈప్రాంతానికి వచ్చే అవకాశం ఉందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. సదరు ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నామని, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని ఎఫ్ఆర్ఓ మురళి తెలిపారు. పాపికొండల అభయారణ్యం ఈప్రాంత అడవులకు ఆనుకుని ఉండటంతో అక్కడి నుంచే పులి వచ్చి ఉండవచ్చని వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు రాత్రిపూట ఒంటరిగా బయట తిరగవద్దని సూచించారు.

చారల ఆధారంగా గుర్తింపు..

ఏ రెండు పులులకు చారలు ఒకేవిధంగా ఉండవు. మనుషులకు వేలిముద్రలు ఒకే రకంగా ఎలా ఉండవో.. అలానే పులులకు చారలు ఒకేవిధంగా కనిపించవు. చారలను బట్టి పులి ఎక్కడి నుంచి వచ్చిందో గుర్తించనున్నారు. పాపికొండల నేషనల్ పార్కు నుంచి పులి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు.

అటవీశాఖ వన్యప్రాణి సంరక్షణ విభాగంలో 235 మంది అటవీశాఖ అధికారులు జంతువులను లెక్కిస్తున్నారు. ఉదయం 6.30 గంటల నుంచి 11 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు జంతు సంచారం, కాలినడకన, దారులు ఉన్న ప్రాంతాల్లో సర్వే చేస్తున్నారు. వన్యమృగాలు కనిపిస్తే ఫొటోలు తీసి జంతు గణన యాప్‌లో నిక్షిప్తపరుస్తారు. శ్రీనివాసకాలనీ గుట్టపై డీఎఫ్ఓ కిష్టాగౌడ్, ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి సర్వే చేశారు. కొండగొర్రె పెంటికలను సేకరించారు. అభయారణ్యం ఎఫ్‌డీఓ ఆళ్లపల్లిలో సర్వే చేశారు.

# గగనయానానికి భూ గ్రహణం

కొత్తగూడెం రాష్ట్రంలో పారిశ్రామికంగా, ఆధ్యాత్మికంగా ప్రాధాన్యం కలిగిన జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం ఒకటి. ఇక్కడ బొగ్గు గనులు, పరిశ్రమలు ఉన్నాయి. భద్రాచలం రామయ్యను దర్శించుకోవటానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వినామాశ్రయం కావాలనేది దశాబ్దాల కల. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇక్కడ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సుముఖంగా ఉన్నప్పటికీ అనేక



అవరోధాలతో అడుగు ముందుకు పడటం లేదు.

పట్టాలెక్కని ప్రతిపాదనలు

నిధులున్నా.. విమానాశ్రయ నిర్మాణానికి అనువైన స్థలం దొరక్కపోవటం సమస్యగా మారింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన భూములు భద్రాద్రి జిల్లాలో లభ్యమవటం లేదు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, బంగారుచెలక.. చుంచుపల్లి-సుజాతనగర్, కొత్తగూడెం మండలాల్లో గుర్తించిన భూములను కేంద్ర బృందాలు పరిశీలించాయి. రెండుచోట్ల రన్‌వే నిర్మాణానికి అవసరమైన సాంకేతిక ప్రమాణాలు లేవని తేల్చిచెప్పటంతో ఆ ప్రతిపాదనలు పట్టాలెక్కలేదు.

అలైన్‌మెంట్‌ను మార్చితే..

చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల్లో గుర్తించిన 954 ఎకరాల భూముల్లో కొండలు, గాలివీచే దిశ విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేవని కేంద్రబృందాలు స్పష్టం చేశాయి. కానీ అలైన్‌మెంట్‌ను మార్చటం ద్వారా ఈ ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణానికి అవకాశాలేమైనా మెరుగుపడతాయేమోనని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో మరెక్కడా అనువైన స్థలాలు దొరక్కపోవటంతో ఇదే ప్రత్యామ్నాయ మార్గమని అంచనా వేస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అనుకూలమైన భూముల కోసం అధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా జల్లెడ పడుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. ఇటీవల దుమ్ముగూడెం, టేకులపల్లి మండలాల్లో అధికారులు పర్యటించారు. కొండలు, గుట్టలు, ఇతర భౌగోళిక పరిస్థితులు విమానాశ్రయం నిర్మాణానికి అనువుగా లేకపోవటంతో కథ మళ్లీ మొదటికొచ్చింది.

ఇవే ప్రధాన సమస్యలు..

భద్రాద్రి జిల్లా.. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉండటంతో వరదలు సంభవించే ప్రదేశాల్లో విమానాశ్రయం నిర్మించేందుకు అవకాశం లేకుండా పోతోంది.

భద్రాద్రి జిల్లాలో మెజారిటీ భూభాగం రిజర్వ్ ఫారెస్ట్ కావటం వల్ల పెద్దమొత్తంలో భూములను సేకరించటం ప్రభుత్వానికి సవాలుగా మారుతోంది.

సింగరేణి గనులు సైతం విమానాశ్రయ ఏర్పాటుకు అవరోధంగా మారుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కొండలు, గుట్టలు, వాతావరణ పరిస్థితులు, గాలివేగం వంటి అంశాలు ప్రతికూలంగా మారుతున్నాయి.



# మావోయిస్టుల స్థావరాలపై ఆధిపత్యం సాధించాం

వెంకటాపురం, న్యూస్?టుడే: మావోయిస్టుల రహస్య స్థావరాలైన అటవీ ప్రాంతాలపై ఆధిపత్యం సాధించామని సౌత్? సెక్టార్? సీఆర్పీఎఫ్? ఐజీ టి.విక్రమ్? పేర్కొన్నారు. ఛత్తీస్?గఢ్? సరిహద్దు దండకారణ్య ప్రాంతమైన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కర్రెగుట్టపై పాముమారులో ఏర్పాటు చేసిన ఫార్వర్డ్? ఆపరేటింగ్? బేస్? (ఎఫ్?ఓబీ) క్యాంపును మంగళవారం ఆయన ప్రారంభించారు. క్యాంపు ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మావోయిస్టులకు కంచుకోటగా భావిస్తున్న కర్రెగుట్టలపై పైచేయి సాధించామన్నారు. కీకారణ్యంలోని ఎత్తైన కొండపై వెయ్యి మంది భద్రతా సిబ్బందితో ఎఫ్?ఓబీ ఏర్పాటు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వాజేడు మండలం మురుమూరు క్యాంపుతో మావోయిస్టుల కదలికలు అదుపులోకి వచ్చాయని, పాముమారు ఎఫ్?ఓబీతో ఇక్కడా పైచేయి సాధిస్తామని పేర్కొన్నారు. కర్రెగుట్టలను పూర్తిస్థాయిలో ఆధీనంలోకి తెచ్చేందుకు పాముమారు కేంద్రంగా అటవీ ప్రాంతంలోని జెల్లా, డోలి, తడపలకు రహదారి సౌకర్యం మెరుగుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. పాముమారులో నివసిస్తున్న ఏడు కుటుంబాలకు చెందిన 23 మంది గిరిజనులు మైదానానికి వెళ్లేందుకు అవసరమైన నదుపాయాలు కల్పించామన్నారు. మావోయిస్టు ఉద్యమానికి భవిష్యత్తు లేదని భావించిన అగ్రశ్రేణి నాయత్వం లొంగుబాటు బాట పట్టారని, అడవుల్లో మిగిలి ఉన్నవారు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్? డీఐజీ అనిల్? మిన్జ్, కమాండెంట్లు ప్రశాంత్?కుమార్? శ్రీవత్సవ, ముఖేశ్, ములుగు ఎస్పీ సుధీర్? రాంనాథ్? కేకన్, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్?భట్, డీఎస్పీ బీవీ ప్రశస్థ, వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్, ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

# అక్షరాల నిర్లక్ష్యం.. దక్కని వ్యవసాయం

, ఖమ్మం: జిల్లాలో రుణాల జారీ విషయంలో బ్యాంకర్లు ప్రాధాన్య రంగాలను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు 57.88 శాతం లక్ష్యం చేరారు. విద్యార్థుల ఉన్నత చదువులు, వ్యవసాయ మౌలిక వసతుల కల్పనకు కేటాయించిన రుణాల్లో పావలా వంతూ ఇవ్వకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన రంగాల్లో ముందంజలో ఉంటూ.. కీలక రంగాలను వదిలేయడం విచారకరం. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు అంటే సుమారు 70 రోజుల్లో అన్ని రంగాల్లో లక్ష్యం చేరడం కష్టమేనని తెలుస్తోంది.

ప్రాధాన్య రంగాలు.. లక్ష్యాలు

జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి




మొత్తం రూ.12,204.95 కోట్ల రుణాలు ఇవ్వాలని 31 బ్యాంకులకు లక్ష్యం నిర్దేశించారు. గత నెలాఖరులో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రెండో త్రైమాసిక సమీక్ష సమావేశం వరకు రూ.7,064.07 కోట్లు మాత్రమే ఇచ్చారు. ప్రాధాన్య రంగాల్లో పెద్దగా పురోగతి లేదు.

వ్యవసాయ ఆధారిత రుణాలు సగం వరకే పంపిణీ చేశారు. ఇందులో ఇన్‌ఫ్రా రుణాలు 19 శాతమే ఉన్నాయి. వీటి వినియోగంపై అవగాహన లేక రైతులు లబ్ధి పొందటం లేదు.

విద్యారుణాలు రూ.97కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశిస్తే..14 శాతమే పంపిణీ చేయటం విచారకరం. విద్యారుణం కోసం నేరుగా పీఎం విద్యాలక్ష్మి పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని బ్యాంకర్లు పరిశీలించి మంజూరు చేస్తారు. ఎన్ని అర్జీలు వచ్చాయి..ఎంతమందికి ఇచ్చారో సమాచారం లేదంటూ అదనపు కలెక్టర్ సమీక్షలో అధికారులు చేతులెత్తేయటం గమనార్హం. అమెరికాలో నెలకొన్న పరిస్థితుల వల్ల ఆ దేశం వెళ్లేవారు తగ్గారని, వీసాలు సకాలంలో దొరక్క లక్ష్యాన్ని చేరలేకపోయామని బ్యాంకర్లు చెబుతున్నారు. విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తే ప్రతిఫలం ఉంటుంది.

గృహ రుణాల్లో మాత్రం పురోగతి కనిపిస్తోంది. ఇళ్లు లేదా స్థలం తనఖా పెట్టుకోవడం, క్రెడిట్ స్కోర్, వేతనం ఆధారంగా ఈ రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా 153 శాతం ఇవ్వగలిగారు.


సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించటానికి రూ.3వేల కోట్లు కేటాయించగా.. సగం పంపిణీ చేశారు. వివిధ కారణాలతో కొర్రీలు పెడుతూ దరఖాస్తులు తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇతర రంగాల్లో 123 శాతం రుణాలు ఇవ్వటం, ప్రాధాన్య రంగాలను విస్మరించటం అధికారుల పర్యవేక్షణ లేమిని ఎత్తిచూపుతోంది.

వచ్చే త్రైమాసిక సమావేశంలోపు ప్రాధాన్య రంగాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని బ్యాంకర్లు చేరేలా చర్యలు తీసుకుంటామని లీడ్ బ్యాంక్ మేనేజర్ రవిప్రసాద్ ‘ఈనాడు’కు తెలిపారు.

# నిఘా నేత్రాలు

నిజామాబాద్ నేరవిభాగం: జిల్లాలో దొంగతనాల రేటు ఎక్కువ. వీటిని అరికట్టడం కేవలం పోలీసులకే సాధ్యం కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అనివార్యమైంది. కొందరు ఏర్పాటు చేశాక అలాగే వదిలేయకుండా నిర్వహణపై దృష్టిసారించాలి. లేదంటే ఫలితం దక్కదు. ఏడాదికి ఓసారి నిర్వహణ పనులు, చిన్నచిన్న మరమ్మతులు చేయించాలి.



నిరంతరం వీక్షిస్తూ.. అప్రమత్తం చేస్తూ

జిల్లా కేంద్రంలోని రోడ్లు, కూడళ్లలో పోలీసు శాఖ వారు 132 కెమెరాలు, ఠాణాల పరిధిలో 650 ఉన్నాయి. ప్రధాన కూడళ్లలో 9 పీటీజెడ్ కెమెరాలు ఉండగా.. అవి 360 డిగ్రీల్లో దృశ్యాల్ని చిత్రీకరిస్తున్నాయి. నంబరు ప్లేట్ల రికగ్నైజర్(ఎన్‌పీఆర్) కెమెరాలు కూడా పలుచోట్ల బిగించారు. ఎప్పటికప్పుడు తెరలపై ఆయా దృశ్యాలు వీక్షిస్తూ స్థానిక బలగాలను అప్రమత్తం చేస్తున్నారు. ఇదే సమయంలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, కాలనీ సంక్షేమ సంఘాలు, వాణిజ్య దుకాణాలున్నచోట విధిగా నిఘా నేత్రాలు బిగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

ఇలా చేస్తే ప్రయోజనం..

పోలీసు శాఖ పరిధిలోని సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నారు. ఇంకా ఎక్కడైనా.. పనిచేయనివి ఉంటే వెంటనే బాగు చేయించాలి. అసలే పనిచేయనివి ఉంటే.. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తున్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే గానీ నిఘా నేత్రాల విలువ ఏమిటో అర్థం కాదు. ఇటీవల గాంధీచౌక్‌లోని ఓ మొబైల్ దుకాణంలో ఇద్దరు వ్యక్తులు చొరబడి చోరీకి ప్రయత్నించారు. సీసీ కెమెరా దృశ్యాల ద్వారా ఇది గమనించిన భవన యజమాని స్థానికులను మేల్కొలిపి దొంగలను పోలీసులకు పట్టించాడు. ఈ నేపథ్యంలో ‘నేనుసైతం’లో భాగంగా పోలీసులు నగర, పురవాసులకు కెమెరాల ఏర్పాటు, నిర్వహణ పదే పదే వివరించి చెబుతున్నారు.

# దృష్టి మరల్చి.. చోరీలకు పాల్పడి..

వికారాబాద్, : మహిళల దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 80 గ్రాముల బంగారు ఆభరణాలు, అరకిలో వెండి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ స్నేహమెహ్రా వివరాలు వెల్లడించారు. గతేడాది నవంబరు 22న ధారూరు మండలానికి చెందిన కంది లక్ష్మమ్మ కూరగాయల మార్కెట్ దగ్గర ఉండగా.. అపరిచితురాలు వచ్చి నకిలీ బంగారు కడ్డీ చూపించింది. బంగారం అని నమ్మించి మహిళ మెడలోని 18 గ్రాముల బంగారు గొలుసు, చెవి కమ్మలు, ఇతర వస్తువులు తీసుకొని పరారైంది. నవంబరు 30న వికారాబాద్ పట్టణంలో బాసుపల్లి సత్యమ్మ అనే మహిళకు బంగారం తాపడం చేసిన రాయిని చూపించి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి మాటల్లో పెట్టి మత్తు మందు చల్లి మెడలోని 20 గ్రాముల బంగారాన్ని దొంగిలించిందో మహిళ. ఈనెల 5న పరిగి పట్టణంలో పోమల ఈశ్వరమ్మను వెంబడించి రోడ్డుపై మనీ పర్సు దొరికినట్లు ఓ మహిళ నాటకమాడింది.

# దళారులు కన్నేస్తే వదలరు



హైదరాబాద్ ,జనవరి 21:

:ఆర్థిక నేరస్థులు ఏ అవకాశాన్నీ వదలరు. కాసులు కాజేసేందుకు ఎంతకైనా తెగిస్తారు. మాటల మాయాజాలంతో అందినంత కొట్టేస్తారు. విద్యాసంవత్సరం ప్రారంభమైంది. ఇంజనీరింగ్, వైద్య, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. అర్హత పరీక్షల్లో ర్యాంకు సాధించినవారు ధీమాగా ఉంటే.. అవకాశం చేజారిన పిల్లలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న నగరంలోని దళారులు సొమ్ము చేసుకునేందుకు రంగంలోకి దిగారు. ఇప్పటికే వివిధ మాధ్యమాల ద్వారా పిల్లల ఉన్నత చదువుల కోసం ఆరా తీసిన తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. 'మీరు కోరుకున్న విద్యాసంస్థలో సీటు ఇప్పించే పూచీ మాది' అంటూ బోల్తా కొట్టిస్తున్నారు. కొంతమేర అడ్వాన్స్ చెల్లిస్తే మేనేజ్‌మెంట్ కోటా సీట్లను రిజర్వ్ చేస్తామంటూ వసూళ్లు ప్రారంభించారు. ఇలా జరుగుతున్నాయ్..యూఎస్‌లోని ప్రముఖ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేషన్ సీటు ఇప్పిస్తానంటూ నమ్మించిన ఇద్దరు ఒక బాధితుడి నుంచి రూ.3.25 కోట్లు వసూలు చేసి అరెస్టయ్యారు.అమెరికా, ఇంగ్లండ్‌లో ఉన్నత చదువులకు అవసరమైన ఏర్పాట్లు చేయటమే గాకుండా సీటు పక్కా అంటూ సికింద్రాబాద్‌కు చెందిన కన్సల్టెన్సీ ఏకంగా రూ.2 కోట్లు కాజేసినట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. ఏటా విద్యాసంవత్సరంలో నగరంలోని పలు కన్సల్టెన్సీలు ఇదే దందాతో రూ.కోట్లు కాజేస్తున్నాయి.గతేడాది నగరానికి చెందిన నకిలీ కన్సల్టెన్సీ టెలీకాలర్స్ ద్వారా నీట్ అర్హత పరీక్ష రాసిన అభ్యర్థులకు ఫోన్లు చేయించి సీట్లు కేటాయిస్తున్నామని బురిడీ కొట్టించారు. అడ్మిషన్ ఫీజుగా పేర్కొంటూ ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు వసూలు చేశారు. బెంగళూరులో బాధితులు ఫిర్యాదు చేయటంతో అక్కడి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఇదే తరహాలో ప్రస్తుతం నగరంలోని కొన్ని కన్సల్టెన్సీలు కమీషన్ ఆశ చూపి ఏజెంట్లను రంగంలోకి దింపాయి. మరికొందరు అట్టహాసంగా కార్యాలయాలు ప్రారంభించి టెలీకాలర్స్‌ను నియమించుకున్నారు. పాఠశాలలు, కళాశాలల నుంచి తాము సేకరించిన విద్యార్థుల జాబితాలో అర్హత పరీక్ష రాసిన పిల్లల వివరాలను వేరు చేస్తున్నారు. దేశ, విదేశాల్లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయంటూ ఫోన్లు చేస్తున్నారు.ఎస్సార్‌నగర్‌లో ఉంటున్న ప్రయివేటు ఉద్యోగికి తాము కన్సల్టెన్సీ నుంచి ఫోన్ చేస్తున్నామని, బెంగళూరులోని ప్రముఖ విద్యాసంస్థలో ఎంబీఏ సీటు కావాలంటే రూ.50 వేలు అడ్వాన్స్ చెల్లించి రిజర్వ్ చేసుకోవాలని సూచించారు.మాయగాళ్లతో జర భద్రంఉన్నత విద్యాసంస్థల్లో సీటు రిజర్వ్ చేసుకోమంటూ సామాజిక మాధ్యమాలు, నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ఆకట్టుకునే ప్రకటనలతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ముందుగా అడ్వాన్స్ చెల్లించమని అపరిచిత వ్యక్తులు, సంస్థలు మాటలు నమ్మొద్దంటున్నారు. అట్నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌లో వాస్తవాలను గుర్తించాలి. ఆయా విద్యాసంస్థల్లోని పూర్వవిద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకోవచ్చు. నేరుగా కళాశాలల యాజమాన్యాన్ని కలసి వాస్తవాలను నిర్ధారించుకోవాలని పోలీసులంటున్నారు. బాధితులు తక్కువ మొత్తంలో సొమ్ము నష్టపోయినా పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందే. నకిలీల గుట్టు బయట పడకుంటే మరికొందరు మోసపోయే ప్రమాదం ఉంది.

# తెర వెనుక శ్రామిక శక్తి

రాయదుర్గం,జనవరి 21:

:నగరం జాతీయ, అంతర్జాతీయ ఐటీ సంస్థలకు కేంద్రంగా మారింది. ఆ సంస్థల కార్యాలయాల్లో నీటి కుళాయి పనిచేయకపోయినా.. ఇంటర్నెట్ రాకపోయినా, విద్యుత్ నిలిచిపోయినా ఆ ఉద్యోగులు రంగంలోకి పరిష్కరిస్తారు.. అదే ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్.. ఇందులో నగరంలో లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఉద్యోగిపై ప్రభావం పడకుండా.. కార్యాలయాల్లో సౌకర్యాల లేమి కారణంగా ఉద్యోగి నిరుత్సాహానికి గురై.. చేసే పనిలో శ్రద్ధ వహించని పరిస్థితి నెలకొంటే ఉత్పత్తి తగ్గి సంస్థలు నష్టాల పాలయ్యే ప్రమాదం ఉంటుంది. ఉద్యోగి మరింత చలాకీగా పనిచేసేలా ఐటీ సంస్థలు ఆహ్లాదకరమైన వాతావరణం, ఆధునిక వసతులు కల్పిస్తున్నాయ్యి. ఆ వసతుల్లో లోటుపాట్లు లేకుండా.. నిత్యం కనిపెడుతూ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ చూసుకుంటుంది. ఎలక్ట్రీషియన్ నుంచి ప్లంబర్, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, వైద్య సిబ్బంది వరకూ పనిచేస్తారు. సరికొత్తగా.. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలోనూ ఈ విభాగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఇటీవల కొత్తగా ఐటీ కార్యాలయాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. అనారోగ్యానికి గురయ్యే ఉద్యోగులకు అందులో ప్రథమ చికిత్స అందించి అవసరమైతే సమీపంలోని ఆసుపత్రులకు తరలిస్తారు. సీపీఆర్ నిర్వహించేలా సుశిక్షితులైన వారిని ఉంచుతున్నారు. కొత్త తరం ఆకాంక్షలకనుగుణంగా.. కొత్తతరం ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పరిశ్రమ సౌకర్యాలు కల్పిస్తోంది. ఉద్యోగికి మానసికోల్లాసం, ప్రశాంతత కల్పించేలా పని ప్రదేశాల్లో పచ్చదనం, సహజ వెలుతురు, చుట్టూ వాతావరణం ఆహ్లాదంగా తీర్చిదిద్దుతున్నారు. ్య ఓ మూల ప్రత్యేక కొలాజ్ స్పేసెస్‌లలో ఉద్యోగి సహోద్యోగులతో ముచ్చటిస్తూ పనిచేసుకునేలా వసతులు కల్పిస్తున్నారు. ్య వెన్నెముక, మెడ సమస్యలు రాకుండా కుర్చీలు, బడలిక కోసం మధ్యలో లేచి బాల్కనీలో పచార్లు కొట్టే సౌకర్యం ఉంటుంది. అవన్నీ నిర్దిష్టంగా నిర్వహించేది ఈ శ్రామిక శక్తే.. విద్యుత్, ఇంటర్నెట్‌లలో అంతరాయం రాకుండా చూస్తారు.



మరుగుదొడ్ల పరిశుభ్రత లీకేజీలకు మరమ్మతుల బాధ్యతా వీరిదే. పనుల విభాగాలిలాఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్‌లో హార్డ్ (కఠినమైన). సాఫ్ట్ (మృదువైన) సర్వీసెస్ అనే రెండు విభాగాలుగా సేవలందిస్తారు.హార్డ్ సర్వీసెస్: సౌకర్యాల నిర్వహణ, హెచ్‌వీఏసీ(హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండీషనింగ్ సిస్టం), ప్లంబింగ్, విద్యుత్, లైటింగ్, అగ్నిమాపక వ్యవస్థ, పునర్‌నిర్మాణం, ఆధునికీకరణ, ఆక్యుపెన్సీ వంటి సేవలు.సాఫ్ట్ సర్వీసెస్: సిబ్బంది నియామకం, స్థలాల ప్రణాళిక, వ్యర్థాల నిర్వహణ, కార్యాలయాల పరిశుభ్రత, క్రిమికీటకాల నివారణ, అంతర్జాల సేవలు, సాంకేతిక సహకారం, ఉద్యోగుల భద్రత, ఈహెచ్‌ఎస్ నిర్వహణ పర్యవేక్షణ ఉంటుంది.30 లక్షల మందికి పైగా ఉపాధిసత్య మాదాల, తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ రంగంలో నగరంలో 30లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ముగ్గురు సిబ్బంది నిష్పత్తిలో సేవలందిస్తుంటారు. నగరంలోని కార్యాలయాల్లో 5వేల చదరపు అడుగులకు ఒక ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ ఉద్యోగి పనిచేస్తుంటారు. ఐటీ ఉద్యోగిని ఇంటి నుంచి కార్యాలయానికి తీసుకొచ్చి తిరిగి ఇంటి వద్దకు వెళ్లే వరకూ బాధ్యతా మాదే. ప్రపంచవ్యాప్తంగా ఈ రంగం ఉపాధి కల్పనలో ముందుంటోంది. సుశిక్షితులైన వారికి అవకాశాలు పుష్కలం.

# మే..మే..మేసేశారు..!



. రెండు జిల్లాల్లో యూనిట్ల కు 25 శాతం డబ్బులు కట్టినా ఇప్పటివరకు గొర్రెలు అందించలేదు. పైగా కొందరు అధికారులు రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు కమీషన్లు తీసుకున్నారని చెతున్నారు.

హైదరాబాద్,జనవరి 21:

:కులవృత్తులను ఆదుకునేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటివరకు వచ్చిన ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు చేస్తున్నా.. వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన లబ్ధిదారులు చెబుతున్నారు.అధికారులు కమీషన్ల రూపంలో రూ.లక్షలు తీసుకున్నారంటూ ప్రజావాణి ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లకుండా తొక్కిపెడుతున్నారు. రెండు జిల్లాల్లో యూనిట్ల కు 25 శాతం డబ్బులు కట్టినా ఇప్పటివరకు గొర్రెలు అందించలేదు. పైగా కొందరు అధికారులు రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు కమీషన్లు తీసుకున్నారని చెతున్నారు. దీనిపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పందించాలని కోరుతున్నారు.దళారులు... బినామీలు.. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఇప్పటివరకూ జరిగిన గొర్రెల పంపిణీలో కొన్ని సందర్భాల్లో మాత్రమే అధికారులు లబ్ధిదారులతో మాట్లాడారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి గొర్రెలను తరలించడం వరకు దళారీలే కీలకపాత్ర పోషించారు. వీరు గొర్రెలు విక్రయించిన రైతులకు డబ్బులు సక్రమంగా ఇవ్వకుండా బినామీ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు లక్షల యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశామంటూ అధికారులు చెబుతుండగా... ఇందులో 30 శాతానికిపైగా యూనిట్లు ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్ జిల్లాల్లో పంపిణీ చేశారు. గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా? లేదా? అని పరీక్షించి నివేదికలు ఇవ్వాల్సిన వైద్యుల్లో కొందరు రూ.1.20 కోట్లు కమీషన్ తీసుకున్నారని అంటున్నారు. స్పందించని ఉన్నతాధికారులు... గొర్రెలు విక్రయించిన రైతుల్లో కొందరు కొనుగోలు చేసిన యూనిట్లకు డబ్బు రాలేదంటూ రెవెన్యూ, పశుసంవర్ధక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

# పసిగట్టేస్తాం.. పట్టేస్తాం



హైదరాబాద్:జనవరి 21:

పోలీసులకు సవాలుగా మారుతోన్న సైబర్ నేరాలను మరింత సమర్థంగా ఎదుర్కోవడానికి సైబరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. కొత్తగా ఐదు సైబర్‌క్రైమ్ ఠాణా ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కమిషనరేట్ పరిధిలో జోన్‌కు ఒకటి చొప్పున ఉండేలా కసరత్తు చేస్తున్నారు. ప్రతిపాదనలకు ఆమోదం లభించాల్సి ఉంది.జోన్ల కేంద్రంగా పరిష్కారంప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఒక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఉంది. రూ.50 వేల కంటే తక్కువ పోగొట్టుకుంటే స్థానిక స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. అంతకుమించి అయితే సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఈ ఠాణాలో 2024లో ఇప్పటివరకూ 4935 కేసులు నమోదయ్యాయి.డబ్బు రికవరీ సగటున 20 శాతం మించడం లేదు.నేరస్థుల అరెస్టులు సగటున 5 శాతం కూడా ఉండడం లేదు.ఇతర రాష్ట్రాల్లో ఉండే నిందితుల్ని తీసుకురావడానికి వారాల తరబడి పనిచేయాల్సి వస్తోంది కేవలం ఒకే పోలీస్‌స్టేషన్ ఉండటంతో ఈ సమస్య వస్తోంది.జోన్‌కి ఒకటి చొప్పున సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఉంటే.. సగటు కేసుల పరిష్కారం పెరిగే అవకాశముంటుంది.పెరుగుతున్న కేసులురాష్ట్రంలో అత్యధికంగా సైబర్ నేరాలు నమోదయ్యే పోలీస్ యూనిట్లలో సైబరాబాద్ కమిషనరేట్ తొలిస్థానంలో ఉంది. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రానికి కీలకమైన ఐటీ కారిడార్‌తో పాటు అంతర్జాతీయ సంస్థలు సైబరాబాద్ పరిధిలో ఉన్నాయి. వీటికితోడూ వివిధ రాష్ట్రాలకు చెందిన ఐటీ సంస్థలూ ఇక్కడే ఉంటున్నాయి. ఫలితంగా కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. సైబరాబాద్‌లో 2023లో మొత్తం 5,342 కేసులు నమోదైతే.. ఈ ఏడాది తొలి ఏడునెలల్లోనే ఒక్క సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లోనే 4,935 కేసులు నమోదయ్యాయి. స్థానిక పోలీస్‌స్టేషన్లలో రూ.50 వేల కంటే తక్కువ మొత్తాల్లో పోగొట్టుకున్న ఘటనల్లో నమోదయ్యే కేసులు అదనం. ఈ ఏడాదిలోపు ఈ సంఖ్య రెట్టింపయ్యే అవకాశముంది. ప్రస్తుతం రోజూ సగటున 24 కేసులు నమోదవుతున్నట్లు గుర్తించారు.

# అపరిశుభ్రతతో అనారోగ్యం

వికారాబాద్,జనవరి 21:

పారిశుద్ధ్య లోపం, అపరిశుభ్ర పరిసరాలు, కలుషిత ఆహారం వెరసి జిల్లాలోని గురుకులాలు విద్యార్థులను తరచూ అస్వస్థతకు గురిచేసి ఆస్పత్రుల బారిన పడేస్తున్నాయి. ఐదారు రోజులుగా దాదాపు 30 మంది వరకు విద్యార్థులు అనారోగ్యం బారిన పడిన సంఘటన వికారాబాద్ పట్టణ శివారులో ఉన్న అనంతగిరిపల్లి (బాలుర), బూర్గుపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో జరిగి తల్లిదండ్రులను ఆందోళ నకు గురిచేసింది. ఆదివారం ఒక్కరోజే రెండు పాఠశాలలకు చెందిన 19 మంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడ్డారు.ఎట్టకేలకు వీరిని సత్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో ఆపద నుంచి బయట పడ్డారు. సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అంటు వ్యాధుల మాదిరిగా ఒకరి నుంచి మరొకరికి సోకుతాయన్న భయంతో పలువురు విద్యార్థులను తమ వెంట తీసుకెళ్లగా, మరికొందరిని గురుకుల పాఠశాల సిబ్బంది సముదాయించారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది బెదిరింపులుపారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించక పోవడంతోనే అపరిశుభ్రత పరిసరాలు, కలుషిత భోజనం విద్యార్థుల అస్వస్థతకు కారణమవుతున్నాయి. ఇదే విషయాన్ని విద్యార్థులు గుర్తించి పాఠశాల సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా, తల్లిదండ్రులను పిలిపించి టీసీ ఇచ్చి పంపించి వేస్తామని బోధన, బోధనేతర సిబ్బంది బెదిరింపులకు దిగినట్లు పలువురు తెలిపారు. గురుకుల పాఠశాలలో శౌచాలయాలు, వంటగదిని సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో



దుర్గంధ భరితంగా మారాయని, నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదని పలువురు విద్యార్థులు వాపోయారు.అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సౌకర్యాలు కల్పించడంలో విఫలంగత జూన్ 5న అనంతగిరిపల్లి గురుకుల పాఠశాలలో 45 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలయ్యారు. సమాచారం అందుకున్న స్పీకర్, కలెక్టర్, ప్రజా ప్రతినిధులు గురుకుల పాఠశాలను సందర్శించారు. శౌచాలయాలతో పాటు మరికొన్ని మరమ్మతు పనులు చేయాల్సి ఉందని, కొత్త వార్డెన్‌ను నియమిస్తామని తెలిపారు. కొత్త మంచాలు సమకూరుస్తామన్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తరువాత ఆ విషయం మరిచిపోయారు. గత ఫిబ్రవరి 10న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 40 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. ఇలాంటి సంఘటనలు ఇకముందైనా జరగకముందే చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# అలుగుపోస్తున్నవి 16 చెరువులే..

నల్గొండ,జనవరి 21:

: నాగార్జునసాగర్‌కు భారీ వరద వస్తున్నా.. నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీరు పరిధిలో మాత్రం ప్రస్తుతం 16 చెరువులే అలుగుపోస్తున్నాయి. గత నెలలో వారం రోజులు వర్షాలు కురిసినా అవి భారీ స్థాయిలో లేకపోవడంతో నీటి వనరుల్లోకి ఆశించినంత మేర నీళ్లు చేరలేదు. దీంతో వీటి కింద ఉన్న సుమారు రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టు ప్రస్తుతం బీడుగానే ఉంది. తాజాగా సాగర్ ఎడమ కాల్వ నీళ్లతో తొలి ప్రాధాన్యతగా ఆయకట్టు పరిధిలోని సుమారు 350 తటాకాలను నింపాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇప్పుడిప్పుడే వీటి కింద పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.మరోవైపు అధికారుల దార్శనికలోపం, సాగర్ ఎడమకాల్వపై పర్యవేక్షణ లేకపోవడం, నిధుల కొరత వెరసి.. సాగర్ జలాశయానికి భారీ వరద వస్తున్నా.. దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. కాలువ ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయడం లేదని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. గండ్లు పూడ్చడం, పలు మరమ్మతు పనులు ఈ ఏడాది మేలోపే పూర్తి చేయాల్సి ఉన్నా.. వేర్వేరు కారణాలతో అవి లక్ష్యం చేరలేదు. కొన్ని చోట్ల పనులకు నిధుల కొరతా వేధిస్తోంది. దీంతో ప్రస్తుతం కాల్వ పూర్తి స్థాయి సామర్థ్యంలో సగం కూడా నీటి విడుదల కొనసాగడం లేదు. రెండేళ్ల క్రితం నిడమనూరు మండలం వేంపాడు వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండి పడి భారీగా పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని ఎకరాల మేర ఇసుక మేటలు వేసింది. అప్పుడు కాల్వలో సగం నీటి విడుదలకే ఇలాంటి పరిస్థితి ఎదురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. నిడమనూరు మండలంతో పాటూ హాలియా, త్రిపురారం, మిర్యాలగూడ మండలాల్లో సాగర్ ఎడమకాల్వ లైనింగ్ దెబ్బతిని శిథిలావస్థకు చేరింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అయినా అధికారులు పకడ్బందీగా వ్యవహరిస్తే ఇప్పుడున్న వరదను సమర్థవంతంగా వినియోగించుకునే పరిస్థితి ఉండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఖాళీగానే సగం చెరువులు..ఉమ్మడి నల్గొండలో 4,444 చెరువులు ఉండగా.. నల్గొండ సీఈ పరిధిలో 1628, సూర్యాపేట సీఈ పరిధిలో 1225 చెరువులున్నాయి. మిగతావి గజ్వేల్ సీఈ పరిధిలోని యాదాద్రి జిల్లాలోనివి. తాజాగా నీటిపారుదల శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం నల్గొండ, సూర్యాపేటల్లోని 1866 నీటివనరుల్లో నీళ్లు 25 శాతం లోపే ఉన్నాయి. యాదాద్రి జిల్లాలోని మూసీ పరిధిలో ఉన్న సుమారు 100కు పైగా చెరువులు అలుగుపోస్తున్నాయి. మూసీ పరివాహకంలో లేని చెరువుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో వాటి కింద రైతులు ఈ ఏడాది పంటలను సాగు చేయడం లేదు. ఎనిమిది వేలకు పైగా క్యూసెక్కుల నీటిని కాల్వకు విడుదల చేస్తే తప్ప మరో



పక్షం రోజులకు గానీ చెరువులు నింపే పరిస్థితి కనిపించడం లేదని తెలిసింది. చాలా చెరువుల ఫీడర్ ఛానెళ్లు దెబ్బతినడం, కొన్ని ఆక్రమణకు గురి కావడంతోనే ఈ పరిస్థితులు నెలకొన్నాయన్న వాదన ఉంది.

## బాల్యం.. కలవరం

ఖమ్మంజనవరి 21:

,తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత మధ్య ఎదగాల్సిన పసి మొగ్గలు అర్ధాంతరంగా రాలిపోతున్నాయి. తీరా నష్టం జరిగాక తీరం కనపడని విషాదాల్లో కన్నవాళ్లు మునిగిపోతున్నారు. బలవంతపు చదువులు, చెడు స్నేహాలు, అనారోగ్య సమస్యలు, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటివి టీనేజర్ల ఆత్మహత్యకు కారణాలుగా ఘటనలను బట్టి తెలుస్తోంది. ఇప్పటికైనా కళ్లు తెరవాలని.. పిల్లల మనసెరిగి మసలుకోవాలని మానసిక నిపుణులు, పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

ఒక్క భద్రాద్రి జిల్లాలోనే ఈ ఏడాది పదిమంది మైనర్లు బలవన్మరణాలకు పాల్పడ్డారు. సమాజంలో ఎదురయ్యే మంచీ చెడుల వ్యత్యాసాన్ని పసిగట్టలేని ప్రాయంలో.. ప్రాణాలే తీసుకునేంతగా నేటి టీనేజర్లను ఆలోచనలు వెంటాడుతుండడం బాధాకరం. మనసులోని బాధను చెప్పుకొనేంత సాన్నిహిత్యం కొందరు బాలలకు తల్లిదండ్రుల వద్ద కొరవడుతోంది. ఫలితంగా కుంగుబాటుకు లోనై బలవన్మరణానికి పాల్పడుతున్నారు. కేవలం చదువులు, పరీక్షల ఒత్తిళ్లే ఈ దారుణాలకు దారితీయడం లేదన్నది పోలీసు అధికారుల వాదన. కొందరిపై భావోద్వేగాలు, సున్నిత మనస్తత్వం, చెడు స్నేహాలు, మత్తు అలవాట్లు, స్మార్ట్‌ఫోన్ల వినియోగం, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్ వంటి ప్రభావాలు చూపుతున్నాయని చెబుతున్నారు. మరికొందరు అనారోగ్య సమస్యలి తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు.చుంచుపల్లి మండలానికి చెందిన ఓ బాలిక (15) తన స్నేహితుడు మరణించాడనే బాధతో కుంగుబాటుకు లోనైంది. క్షణికావేశంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది.

# పంటలకు నీళ్లు.. ఆనంద లోగిళ్లు



నల్గొండ,జనవరి 21:

'ఎడమ కాల్వతో పాటూ లోలెవల్ కెనాల్, ఏఎమ్మార్పీకి పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేస్తున్నాం.. మేజర్లు, మైనర్లకూ నీటిని విడుదల చేసి ప్రాధాన్య క్రమంలో కాల్వలకు అనుసంధానంగా ఉన్న అన్ని చెరువులనూ నింపుతాం.. తద్వారా ఉమ్మడి జిల్లా ప్రజలకు తాగునీటికి, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులుండవు.'.ఎడమ కాల్వకు నీటివిడుదల సందర్భంగా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ప్రకటనసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో ఎడమ కాల్వకు రెండేళ్ల తర్వాత సాగుకు ప్రభుత్వం నీటిని విడుదల చేసింది. దీంతో ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రాధాన్య క్రమంలో చెరువులను నింపడంతో పాటూ ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకూ పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తామని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ప్రకటించడంతో.. ఈ సీజన్‌లో వరి సాగు గణనీయంగా పెరగనుంది. ఇప్పటికే ఆయకట్టులోని 3.5 లక్షల ఎకరాలు, ఏఎమ్మార్పీ కింద ఉన్న 2.5 లక్షల ఎకరాల్లో నామమాత్రంగానే వరి సాగవుతోంది. తాజా పరిణామాలతో ఈ ఏడాది వానాకాలంతో పాటూ యాసంగికీ ఢోకా ఉండదన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. గతేడాది సాగర్‌లోకి నీళ్లు రాకపోవడంతో సాగునీటికి, తాగునీటికి కటకటలాడిన పరిస్థితి నెలకొంది. బత్తాయి, నిమ్మ తోటలతో పాటూ పంటలను కాపాడుకోవడానికి రైతులు విపరీతంగా బోర్లు తవ్వించారు. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా భూగర్భజలాలు పాతాళంలోకి పడిపోయాయి.స్విచ్ ఆన్ చేసి నీటి విడుదల ప్రారంభించిన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ నారాయణరెడ్డి, మిర్యాలగూడ, దేవరకొండ ఎమ్మెల్యేలు బీఎల్ఆర్, బాలు నాయక్, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ఇప్పటి వరకు సాగైంది 43 శాతమే..వర్షాభావ పరిస్థితులకు తోడు, ప్రాజెక్టుల్లో నీళ్లు లేకపోవడంతో వానాకాలం సీజన్ రెండు నెలలు గడిచినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల సాగు సగటు 43 శాతం నమోదైంది. అతి తక్కువగా సూర్యాపేట జిల్లాలో కేవలం 21.98 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలను సాగు చేశారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి పత్తి సాధారణ విస్తీర్ణం 9.19 లక్షల ఎకరాలు కాగా.. జులై 31 నాటికి 5.70 లక్షల ఎకరాల్లో సాగైంది. వరి సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా తగ్గింది. మూడు జిల్లాల్లో ఈ సీజన్‌లో 11.01 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేస్తారని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు కేవలం 2.31 లక్షల ఎకరాల్లో మాత్రమే అన్నదాతలు నాట్లు వేశారు. ప్రాజెక్టులోకి వరదనీరు గణనీయంగా వచ్చి చేరుతుండటంతో ఈ నెలాఖరులోపు మరో ఆరు లక్షలకు పైగా ఎకరాల్లో రైతులు నాట్లు వేయనున్నారు.

# ఐటీహబ్‌లో ఉంది.. అటెండరే..!

సూర్యాపేట ,జనవరి 21:

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు, ఇంజినీరింగ్ పట్టభద్రులకు సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉపాధినిచ్చే దిశగా గత ప్రభుత్వం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఐటీ హబ్ ఏర్పాటు చేసింది. సూర్యాపేట పురపాలిక పరిధిలోని దురాజ్‌పల్లిలో పాత కలెక్టరేట్ను అద్దెకు తీసుకుని గత ఆగస్టులో అట్టహాసంగా ప్రారంభించారు. ఉద్యోగాల కల్పనకు ముందుకొచ్చిన కంపెనీలు 70 మందికి మూడు నెలల పాటు శిక్షణ అందించాయి. ఆ తరువాత ఎన్నికలు రావడం, అక్కడ ఎన్నికల సామగ్రి ఉండటంతో ఐటీ హబ్‌ను జిల్లా కేంద్రంలోని పురపాలిక కాంప్లెక్స్‌కు తరలించారు. ఎన్నికలు ముగిసిన తరువాత మళ్లీ పాత స్థానంలోకి మార్చినా, ప్రభుత్వం మారడంతో నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రారంభ సమయంలో ముందుకొచ్చిన కంపెనీలు లేకపోవడంతో ఐటీ హబ్ మనుగడ లేకుండా పోయింది.ఎన్నికలు మగిశాక.. తారుమారుసూర్యాపేటలో రెండు అంతస్తుల్లో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌ను అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కింది అంతస్తులో అన్ని ఛాంబర్లు సిద్ధం చేయగా, కంపెనీల కార్యకలాపాలకు కాన్ఫరెన్స్ హాల్స్, సెంట్రల్ ఏసీ, విశాలమైన గదులను అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్దారు. తొలుత 18 కంపెనీలకు 15 కంపెనీలు సెప్టెంబరులో నిర్వహించిన ముఖాముఖికి 4,212 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో మొదటి విడతగా 350 మందిని ఎంపిక చేసి వారిలో 70 మందికి కేటీఆర్ చేతుల మీదుగా నియామకపత్రాలు అందించారు. ఆ తర్వాత మరో 600 మందిని ఎంపిక చేసి, షిఫ్టునకు 300 మంది చొప్పున విధులు నిర్వర్తించేలా ప్రణాళిక రూపొందించాయి. ఎన్నికల ముగిసిన తరువాత ఎవరికీ ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. ప్రస్తుతం ఐటీ హబ్‌లో




ఒక్క అటెండర్ మాత్రమే విధులు నిర్వర్తించడం గమనార్హం.కంపెనీలకు కేటాయించిన గదులకు వేసిన తాళంనిరుద్యోగులు ఆందోళన చెందొద్దుయాదగిరి, టీఎస్ఐఐసీ, జోనల్ మేనేజర్, సూర్యాపేటఎన్నికల కోడ్ కారణంగా ఐటీ హబ్ నిర్వహణ నిలిచింది. తిరిగి నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో ముందుకు వచ్చిన కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నాం. కొత్తగా ఎవరైనా ఎన్‌ఆర్ఐలు ముందుకు వస్తే కంపెనీ ఏర్పాటుకు అన్ని వసతులు కల్పిస్తాం. నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.ఇంజినీరింగ్ పూర్తి చేశాను.ఐటీ హబ్‌లో నిర్వహించిన ముఖాముఖికి హాజరయ్యాను. ధ్రువపత్రాలు పరిశీలించిన తరువాత, వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చాను. నెలకు రూ.20 వేల వేతనం ఇస్తామంటూ ఉద్యోగానికి ఎంపిక చేయడంతో ఎంతో సంతోషపడ్డాను. రెండు నెలల పాటు శిక్షణ సైతం ఇచ్చారు. తరువాత మళ్లీ పిలుస్తామన్నారు. నేటికీ ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

# తాను వెళ్లినా.. తనువుల్లోనే..!

మిర్యాలగూడ జనవరి 21:

:తమ కుటుంబ సభ్యులు ఇక తిరిగిరారన్న బాధలోనూ ఇతరుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు వస్తున్నారు ఉమ్మడి జిల్లా వాసులు. మూఢనమ్మకాలు, అపోహల కారణంగా జీవన్మృతుల అవయవాలను దానం చేసేందుకు అనేక మంది వెనుకాడుతున్నారు. కాగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన జీవన్‌దాన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా అవయవదానంపై విస్తృత ప్రచారం చేస్తూ.. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవయవదానాల సంఖ్య పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 2022లో 13 మంది అవయవదానం చేయగా.. 2023లో 17 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకు 19 మంది ఉమ్మడి జిల్లా వాసులు అవయవదానం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు దాతల కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ వారు ఘనంగా సత్కరించారు. నేడు 'జాతీయ అవయవదాన దినోత్సవం' సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అవయవదాతల కుటుంబాలను 'న్యూస్‌టుడే' పలకరించింది.ఇతరుల రూపంలో బతికే ఉంటాడుకందుల సరోజ, రెడ్ల రేపాక, వలిగొండ మండలం, యాదాద్రి జిల్లామా బంధువు మరణించడంతో కుటుంబ సభ్యులమందరం కలిసి మేలో ఖమ్మం వెళ్తుండగా.. చిట్యాల సమీపంలో కారు మూడు పల్టీలు కొట్టింది. ప్రమాద సమయంలో ముగ్గురు పిల్లలతో కలిసి మొత్తం ఏడుగురం ఉన్నాం. ఎవ్వరికీ ఏమీ కాలేదు కానీ.. ఆరేళ్ల మా చిన్న కుమారుడు హర్షకు గాయాలు కావడంతో సమీపంలోని కామినేని ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి తరలించాం. వారు పరీక్షించి బాబు బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు సమాచారం అందించారు. దీంతో వారి సూచన మేరకు జీవన్‌దాన్ ఆధ్వర్యంలో అవయవదానానికి నా భర్త నరేష్, కుటుంబ సభ్యులము ఒప్పుకున్నాం. మా కుమారుడు మరణించినా.. ఇతరుల రూపంలో బతికే ఉంటాడనే ఆశతోనే అవయవదానం చేశాం.కంటి ఆసుపత్రికి వెళ్లి కన్ను మూసింది ఉబ్బపల్లి మధుసూదన్, తుమ్మగూడెం, మోతె మండలం, సూర్యాపేట జిల్లానా భార్య ఉమకు కంట్లో నీరు



తమ కుటుంబ సభ్యులు ఇక తిరిగిరారన్న బాధలోనూ ఇతరుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు వస్తున్నారు ఉమ్మడి జిల్లా వాసులు. మూఢనమ్మకాలు, అపోహల కారణంగా జీవన్మృతుల అవయవాలను దానం చేసేందుకు అనేక మంది వెనుకాడుతున్నారు.

వస్తుండడంతో ఆసుపత్రిలో చూపించేందుకు హైదరాబాద్ వెళ్లాం. అక్కడ రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొట్టడంతో ఉమ తలకు బలమైన గాయమైంది. వెంటనే పలు ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లగా కష్టమని చెప్పడంతో కామినేని ఆసుపత్రికి తీసుకెళ్లాము. వారు ఉమ బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు తెలిపారు. దీంతో ఆసుపత్రి, జీవన్‌దాన్ వారు నచ్చచెప్పడంతో మా అత్తింటి వారు, బంధువుల అంగీకారంతో అవయవదానానికి ఒప్పుకున్నాం.అవయవ దానానికి ముందుకు రావాలిమళావత్ మహిపాల్, ప్రజా సంబంధాల అధికారి, జీవన్‌దాన్అవయవదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వారిని చైతన్య పరుస్తున్నాం. అయినా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా అవయవదానంపై అవగాహన రావాల్సి ఉంది. ఒక్కరి అవయువదానంతో నాలుగైదు కుటుంబాల్లో వెలుగులు నిండుతాయి. అందుకే జీవన్మృతుల అవయువాలను దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

# వైద్యకళాశాల ఏర్పాటుపై సందిగ్ధం



భువనగిరి ,జనవరి 21:

:జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్య కశాశాల ప్రారంభంపై సందిగ్ధం నెలకొంది. జాతీయ వైద్య మండలి నుంచి కళాశాల ఏర్పాటుకు తుది అనుమతులు ఇంకా లభించలేదు. రాష్ట్రంలో నూతనంగా నాలుగు వైద్యకళాశాలకు ఏర్పాటుకు జాతీయ వైద్యమండలి నుంచి తుది అనుమతి లభించింది. ఆ జాబితాలో యాదాద్రి వైద్య కళాశాల పేరును ప్రకటించలేదు. ఈ ఏడాది కళాశాల ప్రారంభమవుతుందా లేదా అంశంపై స్పష్టత రావడం లేదు. ఎన్ఎంసీ బృందం ప్రత్యక్ష తనిఖీల సందర్భంగా వచ్చిన అభ్యంతరాలను సరి చేస్తూ వైద్యకళాశాల అధికారులు నివేదికను జులై 25న వర్చువల్ తనిఖీ ద్వారా విన్నవించారు. అయినా సంతృప్తి చెందకపోవడంతో గురువారం విడుదల చేసిన జాబితాలో యాదాద్రి కళాశాలకు అనుమతులు ఇవ్వలేదు. కళాశాలకు అనుబంధంగా జిల్లా కేంద్రాసుపత్రిని బోధనాసుపత్రిగా మార్పు, వైద్యకళాశాలకు ఉండాల్సిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వివరాలను పూర్తి స్థాయిలో లేకపోవడంతో అనుమతి నిరాకరించినట్లు తెలిసింది. వర్చువల్ తనిఖీ తర్వాత దాదాపుగా అనుమతులు ఖరారు అన్న సమయంలో అనుమతి రాకపోవడంతో ప్రజల ఆందోళనకు గురయ్యారు.మరోమారు ఎన్ఎంసీ ముందుకు..జిల్లాలో వైద్యకళాశాల అనుమతి కోసం ఎన్ఎంసీ ముందుకు మరోమారు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కళాశాల ఏర్పాటుకు నిరాకరించిన అంశాలను పూర్తి స్థాయిలో విన్నవించి అనుమతి వచ్చేలా చూసేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వైద్యకళాశాల కోసం బదిలీపై వచ్చిన క్లినికల్, నాన్‌క్లినికల్ స్టాఫ్ జాబితాలో ఎన్ఎంసీకి అందని వివరాలను మరోసారి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బోధనాసుపత్రిపై లేవనెత్తిన ఆక్షేపణలకు వివరణ ఇవ్వనున్నారు. మరోవైపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సిన వైద్యకళాశాలల అనుమతి ఇవ్వాలని ఎన్ఎంసీకి లేఖ రాయనుంది. కళాశాల ఏర్పాటుకు దశల వారీగా తనిఖీలు ఉంటాయని తుది అనుమతులు కచ్చితంగా వస్తాయని వైద్యాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మాఫీ అయ్యేనా..?



గరిడేపల్లి,జనవరి 21:

:రుణమాఫీపై స్పష్టత లేకపోవడంతో రైతులు, అధికారులు అయోమయ స్థితిలో పడ్డారు. అటు బ్యాంకులు, ఇటు వ్యవసాయ శాఖ మాఫీ ఎందుకు కావడం లేదనే విషయంపై సరైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వ్యవసాయ శాఖ లాగిన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడానికే పరిమితమవుతున్నారు. మరోవైపు వ్యవసాయ శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ సాగుతుండటంతో బిజీగా ఉండి రైతులకు సరైన స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. లక్ష, లక్షన్నర మాఫీ విషయంలోనూ చాలా మంది రైతులకు అర్హత ఉండీ మాఫీ కాలేదు. ఎందుకు కాలేదనే విషయం అధికారులు వారి లాగిన్‌లో ఓపెన్ చేస్తే పదికిపైగా కారణాలు కన్పిస్తున్నాయి. కారణాలివి..ప్రధానంగా రుణమాఫీకి బ్యాంకుల్లోని ఖాతాకు ఆధార్ అనుసంధానం కీలకం. దాంతో పాటు రైతుకు ఉన్న రుణం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉందా లేదా అనేదీ ముఖ్యమే. వ్యవసాయ శాఖ లాగిన్‌లో మండల అధికారులు, విస్తరణాధికారులు చూస్తే నో డేటా ఫౌండ్ అని, కుటుంబ సభ్యుల నిర్ధారణ కాలేదని వస్తోంది. ఎక్కువగా ఈ రెండే ప్రధాన కారణాలు కాగా ఆధార్‌కార్డులో ఉన్న పేరుకు బ్యాంకు ఖాతా పేరుకు సంబంధం లేదని వస్తోంది.ముఖ్యంగా మహిళల పేరున ఉన్న ఖాతాలకే ఇది సమస్యగా ఉంది. ఎందుకంటే చాలా మంది మహిళలు ఇక్కడ రుణాలు తీసుకుని అత్తగారింటికి వెళ్లాక ఇంటి పేరు మార్చుకోవడంతో రెండింటికీ తేడా ఉందని, మాఫీలో పేరు లేకుండా పోతోంది. ఒకే పేరు ఉన్న వారి ఆధార్ కొడితే ఒకరిది మరొకరి ఖాతాలో చూపిస్తోంది. అది పెండింగ్ పెట్టారు. అదే విధంగా ఒకే పేరు ఉన్న వారికి వేర్వేరు బ్యాంకుల్లో ఖాతాలు ఉంటే ఒకరి ఖాతాకు వేరే వారి మాఫీ వచ్చింది. ఉదాహరణకు ధన అనే మహిళకు కెనరా బ్యాంకులో రుణం ఉంది. అదే పేరు ఉన్న మరో మహిళకు ఏపీజీవీబీలో ఖాతా ఉంది. కెనరా బ్యాంకులో రుణం ఉన్న మహిళకు మాఫీ రాలేదు. ఆ మాఫీ సొమ్ము ఏపీజీవీబీలో ఉన్న ధన అనే మహిళ ఖాతాలో జమయ్యాయి. ఇలాంటివి చాలా ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అనేక కారణాలతో రుణమాఫీ సొమ్ము అసలు లబ్ధిదారులకు చేరడం లేదు. సందిగ్ధంలో రైతన్న: భారాస ప్రభుత్వం చేసిన కుటుంబ సర్వే, ఇతర సర్వేలను ప్రామాణికంగా తీసుకొని ఉన్నతాధికారుల స్థాయిలోనే స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. కాగా కొత్తగా మరో సమస్య వస్తోంది. 2017-18 సంవత్సరం వరకు పాత పట్టాదారు పాసుపుస్తకాలు పెట్టి పంట రుణాలు తీసుకున్నారు. ఆ తర్వాత వాటినే రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నారు. 2018 తర్వాత వచ్చిన కొత్త పుస్తకాలను బ్యాంకులో తాకట్టు పెట్టలేదు.

కొద్దిమంది రైతులే కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పెట్టారు. అలా పెట్టని వారికి వ్యవసాయ శాఖ లాగిన్‌లో భూమి లేదని వస్తోంది. అలాంటి వారికి రుణమాఫీ వర్తిస్తుందా లేదా అనేది సందిగ్ధంలో పడిందని అధికారులు పేర్కొంటున్నారు.

# చేపపిల్లలు.. చెరువుల్లోకి చేరేనా..?

కొత్తగూడెం:జనవరి 21:

ఈ ఏడాది ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవటంతో పాటు చేపల ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యం నీరుగారిపోతోంది. ఏటా వర్షాకాలం ప్రారంభం కంటే ముందే చేపపిల్లల ఉత్పత్తి, సరఫరా బాధ్యతలను టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించేవారు. ప్రభుత్వం మారటం, పాలకులు, అధికారులు పట్టించుకోకపోవటంతో ఈ ఏడాది టెండర్ ప్రక్రియ ఆలస్యమైంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపపిల్లల పంపిణీకి టెండర్ల ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రకటించినప్పటికీ.. టెండర్లు వేయటానికి ఎవరూ ఆసక్తి చూపటం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరోసారి టెండర్లు పిలుస్తామని, ఎవరైనా ముందుకొస్తే ఈ నెలాఖరు నాటికి చేపపిల్లల పంపిణీ చేపడతామంటున్నారు.పాత బకాయిలు చెల్లిస్తేనే..

ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి సంబంధించి ప్రభుత్వం టెండర్లు పిలవగా.. పాత బకాయిలు చెల్లించలేదనే సాకుతో గుత్తేదారులు బిడ్ దాఖలు చేయలేదు. టెండర్ల గడువును ఈ నెల 4 వరకు సర్కారు పొడిగించింది. అయినా బిడ్ దాఖలు చేయబోమని గుత్తేదారులు చెబుతుండటంతో అనిశ్చిత పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ వ్యవహారంలో పారదర్శకత కోసం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి ఆలస్యంగా నిర్ణయం తీసుకుంది. సమయం లేకపోవటంతో జులై 10న టెండర్లను పిలిచింది. అదేనెల 23వరకు గడువు విధించింది. గడువులోగా ఎవరూ బిడ్ దాఖలు చేయకపోవటంతో ఆగస్టు 4 వరకు గడువును పొడిగించిది. ఈసారి గుత్తేదారులు బిడ్ దాఖలు చేసినా, టెండర్ ఖరారైనా చేపపిల్లల పంపిణీకి కనీసం రెండు, మూడు నెలల సమయం పడుతుందని సమాచారం.ఉభయ జిల్లాల్లో ఇదీ పరిస్థితి..జులైలో కురిసిన వర్షాలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చేపల పెంపకం చేపట్టే చెరువుల్లోకి దాదాపుగా కొత్త నీరు వచ్చి చేరింది. ఉభయ జిల్లాల్లో ఏటా 1,646 చెరువుల్లో ఉచిత చేపపిల్లల పంపిణీ చేపడుతున్నారు. గతేడాది సకాలంలో చేపపిల్లలను చెరువుల్లోకి వదలకపోవటంతో మత్స్యకారులకు తీరని నష్టం వాటిల్లింది. చేపల ఎదుగుదల సరిగ్గా లేక అనేక చెరువుల్లో గత వేసవిలో చేపల వేట



నిలిపివేశారు. ఈఏడాదైనా సకాలంలో చేపపిల్లల పంపిణీ జరుగుతుందని ఎదురుచూస్తున్న మత్స్యకారులకు నిరాశే మిగులుతోంది. తక్షణమే టెండర్ ప్రక్రియ పూర్తిచేసి యుద్ధప్రాతిపదికన చేపపిల్లలను సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఇదే విషయంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ 'ఈనాడు'తో మాట్లాడుతూ ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదని, ప్రభుత్వం టెండర్లను ఖరారు చేయగానే జిల్లాలో చేపపిల్లలను అందజేస్తామన్నారు.

## గ్రామాల్లో సాగు, సంక్షేమం బాగు

మధిర ,జనవరి 21:

:ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర సర్వీసుల బృందం సభ్యులు పేర్కొన్నారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో 2023లో దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీ పరీక్షలో వివిధ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ప్రతిభ చూసి అసిస్టెంట్ సెక్రటేరియట్ అధికారులుగా (ఏఎస్ఓ) ఎంపికయ్యారు. ఆ తర్వాత హైదరాబాద్ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందారు. క్షేత్ర పర్యటన నిమిత్తం ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, కల్లూరు, మధిర, ఏన్కూరు మండలాల్లో 5 బృందాలుగా వివిధ అంశాలపై పరిశీలిస్తున్నారు. మధిర మండలం ఖమ్మంపాడులో వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది. తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను తెలిపారు. తమ విధులను విజయవంతంగా నిర్వహించడానికి

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published at D.No. 42-4-61/A2,Bhavani Residency,FFB,2nd Lane , Ramarajuvari veedi, Ramakrishnapuram, Vijayawada - 520011, Andhra Pradesh,Printed at Sri Muktheswara Publications, D.No. 29-23-11, Thadepalli Vari Veedi, Surya Rao Peta, Vijayawada - 520002, Andhra Pradesh. Fax: 040-24054446, Cell:9440265569
Email: bharathasakti@gmail.com, RNI APTEL/2010/36743, Editor: Kesaram Penta Reddy